5. 3. 2026
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
గురువారం | రంగారెడ్డి, నల్లగొండ
సంపుటి :07 సంచిక : 268 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



## భారత్ చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

- విమానాశ్రయంలో స్టబ్‌కు ఘనంగా స్వాగతం

## సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

- త్వరలోనే స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా
- ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష




**హైదరాబాద్,మార్చి4 వెలుతురు:**
సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## హోంమంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ భేటీ

- ఇటీవల నక్సల్స్ లొంగుబాటు తదితర విషయాల ప్రస్తావన
- సీఎంను, డీజీపి బృందాన్ని అభినందించిన అమిత్ షా



**న్యూఢిల్లీ,మార్చి4( వెలుతురు):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అందుకోసం అమిత్ షా నివాసానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు.



# కేంద్ర జాబితాలో లేని 40 బిసి కులాలు

- జనగణనలో వారిని కూడా చేర్చేలా చూడాలి,
- సిఎస్‌ను కోరిన తెలంగాణ బిసి కమిషన్




**హైదరాబాద్,మార్చి4 వెలుతురు:**

తెలంగాణ రాష్ట్రంలో జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు గృహాల నమోదు జరగనుంది. ఆ తర్వాత జనాభా గణన 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28, వరకు జరగనుంది. జనగణనలో కేంద్ర ప్రభుత్వ ఓబీసీ లిస్టులో ఉన్న తెలంగాణలోని 90 కులాల ప్రజలను మాత్రమే ఓబీసీలుగా గణనలోకి తీసుకోవడం జరుగుతోంది. తద్వారా తెలంగాణలో ఉన్న బీసీ కులాల సంఖ్యను తక్కువగా చూపెట్టే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా గుర్తించడం జరిగింది. కాని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లిస్ట్‌లో కేవలం 90 కులాలను మాత్రమే చేర్చి 40 కులాలను చేర్చడం జరగలేదు. తద్వారా తెలంగాణలో బీసీల సంఖ్య తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది. బీసీ లిస్ట్‌లో లేని 40 కులాలను కూడా ఓబీసీ లిస్ట్‌లో చేర్చాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కాని ఇప్పటివరకు దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ 40 కులాలను ఓబీసీ లిస్ట్‌లో చేర్చిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో జనగణనను ప్రారంభించాలి. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ లిస్ట్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగిందని బిసి కమిషన్ తెలిపింది.

## భారత్ చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,మార్చి4 వెలుతురు:**

ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ విచ్చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తోపాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియా చేరుకున్నారు. స్టబ్ తన పర్యటన సందర్భంగా ఇండియాతో కీలక ఒప్పందాలు చేసుకుంటారు. ఈ మేరకు అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాల్లో ఒప్పందాలు జరుగుతాయి. స్టబ్స్.. ఈ చర్చల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కూడా సమావేశమవుతారు. స్టబ్స్ ఇండియాలో పర్యటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. స్టబ్స్‌కు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్టబ్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా ప్రత్యేకంగా స్పందించారు. భారత పర్యటనపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. గురువారం సాయంత్రం మీడియాతో మోదీ, స్టబ్ మాట్లాడుతారు. ఫిన్‌లాండ్ ప్రధాని పె÷-టటెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక.. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

## ఐటి కంపెనీలపై గత వైసిపి ప్రభుత్వం కక్ష



- అనుమతులున్నా వెనక్కి పోయిన పలు కంపెనీలు
- తిరిగి వారితో చర్చించి వెనక్కి రప్పిస్తున్నాం
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్

**అమరావతి,మార్చి4 వెలుతురు:**

రాష్ట్రంలోని ఐటీ కంపెనీలపై గత వైసీపీ ప్రభుత్వం యుద్ధం చేసిందని.. అందువల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. 2014 – 19 మధ్య ఏపీకి వచ్చిన కంపెనీలు వెనక్కి వెళ్లి పోయాయన్నారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఫార్చ్యూన్ 500లోని ఒక కంపెనీని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తే.. వారిని సైతం వెళ్లగొట్టిందంటూ వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెర్రరిజం మాదిరిగా వ్యవహరించి కంపెనీలను పంపించారంటూ ఆ పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. సదరు కంపెనీలతో మాట్లాడితే గత అనుభవాలను చెప్పి.. వారు ఆందోళన వెలిబుచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వారిని ఒప్పించి కంపెనీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. 8 రకాల పాలసీలు తీసుకు వచ్చి కంపెనీలకు మార్గం సుగమం చేశామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సభలో లేకుండా బయట ఏదేదో ఆరోపణలు చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. నానో కంపెనీ ఏర్పాటుపై పశ్చిమ బెంగాల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన జరిగితే.. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్న గుజరాత్‌కు ఆ సంస్థను ఆహ్వానించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రస్తావించారు. తద్వారా గుజరాత్‌లో ఆ పరిశ్రమ ఏర్పాటైందన్నారు. దీంతో గుజరాత్‌లో ఆ సంస్థ ఆర్థిక కార్యకలాపాలు జోరందుకున్నాయని వివరించారు. ఇదే అంశాన్ని తాము స్ఫూర్తిగా తీసుకున్నామని పేర్కొన్నారు. వివిధ సంస్థలకు రూపాయికి భూములు ఇవ్వడంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ తూర్పారబట్టారు.

## హోంమంత్రి అమిత్ షాతో సిఎం రేవంత్ భేటీ



ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్, డిజిపిలు కేంద్రహోంమతం÷-రి అమిత్ షాకు వివరించినట్లు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించి నక్సల్స్ నిర్మూలన జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా సిఎం రేవంత్‌ను, డిజిపి బృందాన్ని అభినందించారు. దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశిరచుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే మీడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజయ్ కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించారని తెలుస్తోంది.

# సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

# అంతర్జాతీయ మహిళ దినోత్సవం కానుక

- 6 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ
- ఈ నెల 8 నుంచి స్క్రీనింగ్ ప్రారంభం
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్,మార్చి4 వెలుతురు:**

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ఎ÷-లాన్




ఉండాలని సూచించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ÷ల్లై పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొ÷ల్ తయారీ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ దయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. మొత్తం స్క్రీనింగ్‌ను 6 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ÷ళి 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.

# రాజ్యసభకు నితీశ్ కుమార్?

**- బీహార్ రాజకీయాల్లోకి తనయుడి రాక**

**పాట్నా,మార్చి4( వెలుతురు):**

బిహార్ రాజకీయాలు కీలక మలుపు తిరగబోతున్నాయని తెలుస్తోంది. తాజా ప్రచారం చూస్తుంటే ఔననే అనిపిస్తోంది. బిహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్లబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే బిహార్ రాజకీయాల్లో సంచలనం రేగడం ఖాయం. ప్రస్తుతం ఎన్డీయే ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం కొలువుదీరి ఉంది. బిహార్‌లో నితీష్ కుమార్ (జేడీయూ) సీఎంగా కొనసాగుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఆయనకు సీఎం పదవి దక్కింది. కానీ, కూటమిలోని బీజేపీకి ఎక్కువ అసెంబ్లీ స్థానాలున్నాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయేకు 202 సీట్లున్నాయి. అందులో అత్యధికంగా బీజేపీకి 89, ఆ తర్వాత జేడీయూకు 85, కూటమిలోని మిగతా పార్టీలకు 28 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ తప్పుకొంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయనను రాజ్యసభకు పంపాలని జేడీయూ, బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం



ప్రకారం దీనికి కావాల్సిన పక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. జేడీయూ కూడా దీనిపై అంగీకారం తెలిపింది. రాజ్యసభకు నితీష్ నామినేషన్ వేసేందుకు తగిన పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. ఆయన సంతకం పెడితే చాలు.. నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధమైంది. బిహార్ నుంచి జేడీయూ తరపున రెండు రాజ్యసభ స్థానాలకు అవకాశం ఉంది. అందులో రామనాథ్ ఠాకూర్‌ను ఒక అభ్యర్థిగా ఖరారు చేశారు. రెండో అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ రెండో స్థానంలోనే నితీష్ రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉంది. నితీష్ దీనికి పూర్తిగా అంగీకరిస్తే గురువారం నాడే నామినేషన్ దాఖలు చేస్తారు. ఇదే జరిగితే నితీష్ బిహార్‌లో చేపట్టబోయే మలిదశ 'సమృద్ధి యాత్ర' వాయిదా పడొచ్చు. ఈ యాత్ర ఈ నెల 8న ప్రారంభం కావాలి. నితీష్ రాజ్యసభకు వెళ్తే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో బిహార్‌కు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఈసారి ఆ స్థానాన్ని కూటమిలో అత్యధిక స్థానాలున్న బీజేపీ తీసుకుంటుంది. ఆ పార్టీ అభ్యర్థి నూతన సీఎం అవుతారు. రాష్ట్ర రాజకీయాల నుంచి నితీష్ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకోవడం కూడా ఆయన రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడానికి కారణమని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే స్పష్టత రానుంది. ఆయన కుమారుడు రాష్ట్ర రాజకీయాల్లో వస్తున్నారని కూడా తెలుస్తోంది. అందుకే ఆయన జాతీయ రాజకీయాలకు దగ్గరవుతున్నారని ప్రచారం.

## మియాపూర్‌లో డ్రగ్స్ కలకలం

**- ముగ్గురు టెక్కీలను అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,మార్చి4( వెలుతురు):**

మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా.. ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్, ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా. దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

**- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు.**

హైదరాబాద్ వెలుతురు మార్చి 04:

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు. మరో వ్యక్తి కాదు. ప్రజలే న్యాయ నిర్ణేతలు.. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది..? మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారింది..ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారు.. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి..పేదలను ఆదుకునే ప్రయత్నం చేయలేదు.. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి మీరు అధికారాన్ని చెలాయిస్తున్నారు.. నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నారు.. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం మీది.. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటి మీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీ గారిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి.. రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయి తెలంగాణ కు ప్రత్యేక నిధులు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్ మీ వ్యవహారశైలి మార్చుకోవాలి..

# అన్ని ప్రాంతాల్లో మక్కల కొనుగోళ్లు

- **పంటలు పండించినా కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన**
- **మాజీమంత్రి హరీష్ రావు**



సిద్దిపేట,మార్చి4 వెలుతురు:

తెలంగాణలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రైతన్నలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు కాంగ్రెస్ పాలనలో కష్టాలు తప్పడం లేదని అన్నారు. షాపుల్లో ఇవ్వాల్సిన యూరియా యాపుల్లో ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ సర్కార్ విఫలమయ్యిందని అన్నారు. కోతల దశకు వచ్చినా పంట పెట్టుబడి సాయం ఇవ్వలేని దుస్థితికి చేరిందని పేర్కొన్నారు. కనీసం పండించిన పంటైనా అమ్ముకుందా మంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ అదే నిర్లక్ష్యం, వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతుందని వెల్లడించారు. సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, ఆరేపల్లి (అక్కెనపల్లి) గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్న రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని అన్నారు. అనేక జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమవడం, అసలు ఏర్పాటు చేయక పోవడం, చెల్లింపులు ఆలస్యం కావడం, రవాణా సదుపాయాల లేమి వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయని హరీష్‌రావు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించి మక్కలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజాపాలనకు నూతన దిశ.. 99 రోజుల సంకల్ప యాత్ర



**అమరవాజీ నాగరాజు**
**టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ**

సబ్బండ వర్గాలు కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. రాజకీయాల్లో అధికార మార్పు ఒక ఘట్టం మాత్రమే అసలు మార్పు పాలనా తత్వంలో, ప్రజలతో వ్యవహరించే విధానంలో కనిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సంకల్పంతో ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం "ప్రజాపాలన"ను కేవలం నినాదంగా కాకుండా కార్యాచరణగా మలిచేందుకు ముందడుగు వేసింది. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళికతో గ్రామ సభ నుంచి రాష్ట్ర స్థాయి సమీక్ష వరకూ దశలవారీగా ప్రజల వద్దకే పాలనా శైలికి నాంది పలుకుతోంది. బాధ్యత, పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం అనే మూడు సూత్రాలపై నిర్మితమైన ఈ కార్యాచరణ రాష్ట్ర పాలనకు కొత్త దిశానిర్దేశంగా మారబోతోందన్న ఆశలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రజల వద్దకే ప్రభుత్వం లక్ష్యంగా సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్ర బిందువు. ఆ సూత్రాన్ని కార్యరూపంలో చూపించాలనే సంకల్పంతో ప్రభుత్వం అయిదు దశల్లో 99 రోజుల ప్రణాళికను రూపొందించింది. మార్చి 6న ఉమ్మడి జిల్లాల్లో సన్నాహక సమావేశాలతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం, ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి సమావేశాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, మే 22న జిల్లా స్థాయి సమీక్షలు, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా సమగ్ర విశ్లేషణతో కొనసాగనుంది. ఇది కేవలం షెడ్యూల్ కాదు పాలనను ప్రజల ముందుకు తీసుకెళ్లే చట్టబద్ధమైన ప్రక్రియ. గ్రామ సభల్లో వినిపించే ప్రతి సమస్య, ప్రతి సూచన పాలనలో ప్రతిఫలించేలా వ్యవస్థను రూపొందించడం ఈ ప్రణాళిక ప్రత్యేకత.

తొంభై రోజుల సంకల్ప యాత్ర లక్ష్య సాధనకు ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం 99 రోజుల కార్యక్రమాన్ని వ్యూహాత్మకంగా 10 ప్రధాన థీమ్‌లుగా విభజించింది. ఇది రంగాల వారీగా దృష్టి కేంద్రీకరించి, ఫలితాలను కొలిచే అవకాశం కల్పిస్తుంది. ఇందులో భాగంగా పరిశుభ్రత అండ్ పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యతివ్వనుంది. ప్రజా అవసరాల పరిష్కారానికి పాలనలో పారదర్శకత ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది. కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం ద్వారా సేవల వేగం పెరుగుతుంది. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం, స్క్రీనింగ్ శిబిరాలు, మాతా-శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి ఆరోగ్యమే మహాభాగ్యం అన్న భావనకు ఆచరణాత్మక రూపం ఇవ్వనుంది.

వినూత్నంగా చేపట్టనున్న 'అరైవ్-అలైవ' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన, ప్రమాదాల నివారణ చర్యలు ,ప్రాణాల రక్షణకు ప్రభుత్వం కట్టుబాటు చర్యలు తీసుకోనుంది. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతిస్తున్న ప్రభుత్వం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించడం ద్వారా సంక్షేమం ప్రజల గడప దాకా చేరేలా చర్యలు తీసుకోనుంది. మహమ్మారిగా మారుతున్న డ్రగ్స్‌ను అరికట్టడం కోసం ప్రత్యేకంగా పిల్లల భద్రత అండ్ డ్రగ్స్ నిరోధం కార్యక్రమం చేపట్టనుంది. యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచే అవగాహన కార్యక్రమాలు సమాజ భవిష్యత్తుకు రక్షణ కవచంగా ఉపయోగపడుతాయి. అందరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండడమే లక్ష్యంగ విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పాఠశాలల్లో వసతుల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ లెర్నింగ్ అంశాలతో విద్యా రంగానికి నూతన ఊపిరి పోయనున్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు క్రీడలను ప్రోత్సాహించి వారి ప్రతిభను వెలికితీస్తూ అవకాశాలను సృష్టించాలని నిర్ణయించింది.

ప్రజా పాలనలో రైతు సంక్షేమానికి ప్రాధన్యతిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి మరిన్ని కార్యక్రమాలు రూపొందిచనుంది. వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం విత్తనాలు, ఎరువులు సమయానుకూలంగా అందించడంతోపాటు సాగునీటి సమీక్ష, మార్కెట్ సదుపాయాలు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా కృషి చేయాలని నిర్ణయించింది. మహాలక్ష్మి, ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలతో మహిళా సాధికారితకు కృషి చేస్తున్న ప్రభుత్వం వారికి సంబంధించిన స్వయం సహాయక సంఘాల బలోపేతం చేయడంతోపాటు వారిని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిచింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అడవులు, వృక్షాల సంరక్షణ. నీటి వనరుల సంరక్షణ రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి తోడ్పడుతాయి.

ప్రభుత్వం నిర్దేశించుకున్న ఈ 10 థీమ్‌ల సమాహారం చూస్తే ప్రభుత్వం సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నదని స్పష్టమవుతోంది. అభివృద్ధి పనులపై దృష్టి సారించడంతోపాటు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ఫలితాలు ఇస్తున్నాయో ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శంకుస్థాపనలు చేయడం, పనులను ప్రారంభించడమే కాకుండా వాటి పురోగతిపై ఉన్నతస్థాయిలో సమీక్షిస్తూ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులలో పారదర్శకత కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా కార్యక్రమ పర్యవేక్షణ చేపడుతారు. దీంతో రియల్ టైమ్‌లో పురోగతి నివేదికలు అందుబాటులో ఉండటం వల్ల పారదర్శకతతతో కూడిన బాధ్యత పెరుగుతుంది.




ఈ బృహత్ కార్యక్రమంలో ప్రజల ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం ఇందులో వారిని కూడా భాగస్వాములు చూయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రజలు గ్రామ సభల్లో పాల్గొని వారి సమస్యలు తెలియజేయడం, సూచనలు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తాయి. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే, ప్రజలు మాట్లాడడానికి ముందుకు వస్తేనే ప్రజాపాలన సార్థకం ఏర్పడుతుంది.

"ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా దిశను స్పష్టంగా తెలియజేస్తోంది. ఇది కేవలం 99 రోజుల కార్యక్రమం కాదు. పాలనలో నూతన సంస్కృతికి నాంది. పారదర్శకత, ప్రత్యక్ష బాధ్యత, సమగ్ర అభివృద్ధి అనే మూడు సూత్రాలపై ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగే సమీక్షలో ఈ 99 రోజుల ఫలితాలు ప్రతిఫలిస్తాయి. కానీ ఇప్పటికే ఒక విషయం స్పష్టం ప్రజల వద్దకే వెళ్లే పాలన ప్రారంభమైంది. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం.




# హార్ముజ్ జలసంధిలో సడలింపులు

**- చైనా చమురు నౌకలకు ఇరాన్ అనుమతి**

టెహ్రాన్,మార్చి4 వెలుతురు:

ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హార్ముజ్ జలసంధిని మూసివేసింది. ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా.. ఇరాన్‌పట్ల సానుభూతి చూపుతుండటంతో అందుకు ప్రతిఫలంగా ఇరాన్ చైనా నౌకలకు అనుమతి ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రపంచ దేశాల నడుమ చమురు సరఫరాకు హార్ముజ్ జలసంధి కీలకం. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ తీరాలను ఓపెన్ సముద్రంతో కలిపే కీలక చోక్ పాయింట్. ఈ జలసంధిని మూసివేయడం వల్ల గ్లోబల్ సప్లయ్ చైన్‌కు విఘాతం కలుగుతుంది.

# జి.ఎస్.ఐ 176వ వ్యవస్థాపక దినోత్సవం సంస్థ యొక్క బండ్లగూడ కార్యాలయం లో జరిగింది

హైదరాబాద్ వెలుతురు మార్చి 04:

భారత ప్రభుత్వం, గనుల మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ అయిన భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జి.ఎస్.ఐ) 1851లో స్థాపించబడి ప్రపంచంలోనే రెండవ అతి పురాతన మరియు అతిపెద్ద భువైజ్ఞానిక సర్వే సంస్థ (జి.ఎస్.ఐ) 176 వ వ్యవస్థాపక దినోత్సవం సంస్థ బండ్లగూడ-నాగోల్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జి.ఎస్.ఐ మాజీ డైరెక్టర్ జనరల్ మరియు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ ఎం. శ్రీధర్; జి.ఎస్.ఐ దక్షిణ ప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ మరియు కార్యాలయ అధిపతి శ్రీ. వి.వి. మొగల్ నేతృత్వంలో సీనియర్ రిటైర్డ్ అధికారులు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్, డైరెక్టర్లు, అధికారులు మరియు సిబ్బంది సమక్షంలో దీపం వెలిగించడంతో వ్యవస్థాపక వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికీ అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఎ.ఎం.డి.), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్.జి.ఆర్.ఐ), సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ (సి.జి.డబ్ల్యు.బి.) మరియు ఇతర భూవిజ్ఞాన సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు అతిధిలుగా హాజరైనారు. జి.ఎస్.ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ డీడీజీ శ్రీ. ఎస్.ఎన్. మహాపాత్రో, విశిష్ట గౌరవ ప్రముఖులను సాదరంగా ఆహ్వానించి 176 వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి స్వాగత ప్రసంగం చేశారు. 176 సంవత్సరములు పూర్తి చేసుకోడం అనేది సంస్థ యొక్క జి.ఎస్.ఐ యొక్క గొప్ప భూవైజ్ఞానిక వారసత్వాన్ని గౌరవించడమే కాకుండా, దేశ పురోగతి కోసం భూవైజ్ఞానిక శాస్త్రీయ పరిశోధనలు, ఖనిజ అన్వేషణ మరియు సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశం యొక్క పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి కీలకమైన క్రిటికల్, వ్యూహాత్మక ఖనిజ అన్వేషణలో సంస్థ చేస్తున్న ప్రయత్నాలను ఆయన హైలైట్ చేశారు మరియు జి.ఎస్.ఐ యొక్క గొప్ప వారసత్వాన్ని నిలబెట్టడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ. వి.వి. మొఘల్, ప్రముఖులను మరియు అధికారులను స్వాగతించారు మరియు హాజరైన వారందరికీ 176 వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రసంగంలో, ఆయన జి.ఎస్.ఐ యొక్క మార్గదర్శకులకు నివాళు లర్పించారు మరియు సంస్థ ఏర్పాడినప్పడి నుంచీ దేశ నిర్మాణంలో, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సంస్థ యొక్క ముఖ్యమైన పాత్రను నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఇటీవలి భూవైజ్ఞానిక అధ్యయనాలు మరియు ఖనిజ పరిశోధనలలో సంస్థ సాధించిన విజయాలను ఆయన హైలైట్ చేస్తు, అదే సమయంలో దాని కోనసాగించాటానికి జి.ఎస్.ఐ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల దృష్ట్యా జాతీయ అభివృద్ధికి కీలకమైన క్రిటికల్ మరియు వ్యూహాత్మక ఖనిజ వనరుల అన్వేషణను పెంచడంలో జి.ఎస్.ఐ పాత్రని మరియు నిబద్ధతను కూడా ఆయన పునరుద్ఘాటించారు. దేశంలో పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి కీలకమైన మరియు భూమి లోతుల్లో ఉన్న ఖనిజాల అన్వేషణను వేగవంతం చేయడంలో జి.ఎస్.ఐ, ముఖ్యంగా దక్షిణ ప్రాంతం యొక్క కీలక పాత్రను ఆయన మరింతగా నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డైరెక్టర్ జనరల్ మరియు శ్రీ ఎం. శ్రీధర్ హాజరై ప్రసంగించారు మరియు జి.ఎస్.ఐ 176వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. 1851లో రైల్వేల కోసం బొగ్గును కనుగొనడంలో జి.ఎస్.ఐ ప్రారంభ పాత్ర నుండి అత్యాధునిక భూవైజ్ఞానిక శాస్త్రీయ ఆవిష్కరణలలో అగ్రగామిగా ప్రస్తుత స్థానం వరకు జి.ఎస్.ఐ పరిణామాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. క్రమబద్ధమైన ఖనిజ అన్వేషణ కార్యకలాపాలపై బలమైన ప్రాధాన్యతను కొనసాగించడంతో పాటు, ప్రజా ప్రయోజనం భూవిజ్ఞాన శాస్త్రాలు మరియు సముద్ర భూగర్భ అధ్యయనాలను బలోపేతం చేయవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రసంగాల తరువాత, దేశ నిర్మాణానికి, అభివృద్ధికి చేసిన అమూల్యమైన కృషికి గుర్తింపుగా జి.ఎస్.ఐ మాజీ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎం. శ్రీధర్ మరియు ఇతర పదవీ విరమణ చేసిన మార్గదర్శక నాయకులను కార్యాలయ అధిపతి శ్రీ. వి.వి. మొగల్ ఇతర సీనియర్ అధికారులతో కలిసి సత్కరించారు. వేడుకల్లో భాగంగా, పాఠశాల స్థాయి నుంచీ భూవైజ్ఞానిక శాస్త్రంపై శాస్త్రీయ అవగాహనను పెంపొందించడం మరియు ఉత్సుకతను పెంపొందించే లక్ష్యంతో, డాక్టర్ విలియం కింగ్ జియోలాజికల్ మ్యూజియంలో పాఠశాల పిల్లల కోసం వివిధ ఖనిజాలు, శిలాలు, బొగ్గు, మరియు శిలాజాల నమూనాలను ప్రదర్శించారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మరియు రీజినల్ మిషన్ హెడ్-1 శ్రీ దీపక్ హజ్రా అధికారిక ధన్యవాదాలను ప్రతిపాదించారు. గత 176 సంవత్సరాలుగా జి.ఎస్.ఐ దేశానికి అందించిన అద్భుతమైన సేవకు చిహ్నంగా 176 త్రివర్ణ బెలూన్లను విడుదల చేసి, ఆ తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించడంతో కార్యక్రమం ముగిసింది.






### భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా-జి.ఎస్.ఐ) గురించి:

భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జి.ఎస్.ఐ), గనుల మంత్రిత్వ శాఖ యొక్క అనుబంధ కార్యాలయం, భారత ప్రభుత్వ యొక్క ప్రీమియర్ జియోసైంటిఫిక్ ఆర్గనైజేషన్ మరియు ప్రపంచంలో రెండవ పురాతన జియోలాజికల్ సర్వే ఆర్గనైజేషన్. భారతదేశంలోని స్టీమ్ షిప్ నావిగేషన్ మరియు రైల్వేల కోసం బొగ్గు వనరులను గుర్తించడానికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆలోచన 1836 సంవత్సరంలో రూపొందించబడింది. అధికారికంగా, జి.ఎస్.ఐ.ని 4 మార్చి 1851న ఇండియన్ జియాలజీ డోయెన్ సర్ థామస్ ఓల్డ్‌హామ్ స్థాపించారు. సంవత్సరాలుగా, జి.ఎస్.ఐ. దేశంలోని వివిధ రంగాలలో అవసరమైన జియో-సైన్స్ సమాచార భాండాగారంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భౌగోళిక-శాస్త్రీయ సంస్థ హోదాను కూడా పొందింది. దీని ప్రధాన విధులు జాతీయ భౌగోళిక శాస్త్ర సమాచారం మరియు ఖనిజ వనరుల అంచనాను రూపొందించడం మరియు నవీకరించడం. ఈ లక్ష్యాలు భూ సర్వేలు, గాలి మరియు సముద్ర సర్వేలు, ఖనిజ పరిశీలన మరియు పరిశోధనలు, బహుళ-క్రమశిక్షణా భౌగోళిక, జియో-టెక్నికల్, జియో-పర్యావరణ మరియు సహజ ప్రమాదాల అధ్యయనాలు, అలాగే హిమానీనదం, భూకంప-టెక్టోనిక్ మరియు ప్రాథమిక భూగోళశాస్త్రం యొక్క ఇతర శాఖల ద్వారా సాధించబడతాయి. జి.ఎస్.ఐ. అనేది భారతదేశంలో ల్యాండ్‌స్లైడ్ అధ్యయనాలకు నోడల్ ఏజెన్సీ, ఇది కొండచరియలు విరిగిపడే ప్రమాదాల నుండి ప్రాణనష్టం మరియు ఆస్తి నష్టాన్ని తగ్గించడానికి నాణ్యమైన భౌగోళిక-శాస్త్రీయ సమాచారాన్ని అందిస్తుంది. భారతదేశంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదాలను తగ్గించడానికి ప్రణాళికాబద్ధమైన కాలక్రమంలో భారతదేశంలోని అన్ని కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న రాష్ట్రాలు/యు.టి. లలో ప్రాంతీయ ల్యాండ్‌స్లైడ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లను అభివృద్ధి చేయడానికి మరియు అమలు చేయడానికి జి.ఎస్.ఐ కోల్‌కతాలో అత్యాధునిక జాతీయ ల్యాండ్‌స్లైడ్ ఫోర్‌కాస్టింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా, గ్రీన్ ఎనర్జీలో స్వావలంబనను ప్రోత్సహించడానికి మరియు విక్షిత్ భారత్ 2047 దార్శనికతకు దోహదపడటానికి కీలకమైన ఖనిజాలను అన్వేషించడంపై జి.ఎస్.ఐ తన దృష్టిని బలోపేతం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ) మరియు మెషిన్ లెర్నింగ్ (ఎం.ఎల్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుంటూ, సంస్థ ఖనిజ అన్వేషణ మరియు భూశాస్త్ర పరిశోధనల వేగాన్ని వేగవంతం చేస్తూనే ఉంది. డాక్టర్. మల్లేష్ గంజి ప్రజా సంబంధాల అధికారి (PRO) భారతీయ భువైజ్ఞానిక సర్వే సంస్థ హైదరాబాద్-500068, మొబైల్: +91 9989561974

# సంపాదకీయం.. ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా ?



వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్దంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ప్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ప్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్ఘానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి. దేశీయంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. దేశీయ వస్తువులను వాడాలనడం కాదు..దేశీయ ఆహారాలనే వాడలనే నినాదం రావాలి. ఈ యుద్దంతో అయినా పాలకుల ఆలోచనా తీరు మారాలి. లేకుంటే సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. కారణం అవి సరిగా లేకపోవడం లేదా, అమలులో లోపాలు ఉండడమే కారణంగా చూడాలి. ప్రపంచ యుద్దాలతో మనం మారాలి. స్వయం సమృద్ధి దిశగా నడవాలి. సంక్షోభాలను ఎదుర్కొనేలా నిలబడగాలి. అప్పుడే దేశం ఆర్థికంగా నిలబడుతుంది.

# ఇరాన్ రహస్య భూగర్భ అణు ప్రాజెక్ట్ ధ్వంసం


**- దాడిలో ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళం ప్రకటన**



**టెహ్రాన్,మార్చి4( వెలుతురు):**
ఇరాన్పై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్ రహస్య భూగర్భ అణుప్రాజెక్టును తమ దళాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదెహైలో రహస్యంగా ఏర్పాటుచేసిన న్యూక్లియర్ కేంద్రం కాంపౌండ్పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ తెలిపారు. ఈ కేంద్రంలో శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడికి మళ్లించినట్లు పేర్కొన్నారు. గతేడాది జూన్లో తాము ఇరాన్పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని డెఫ్రిన్ ప్రస్తావించారు. ఆ సమయంలో వాడిన మందుగుండు సామగ్రి కంటే ఎక్కువ పేలుడు పదార్థాలను ఈ నాలుగు రోజుల్లో ఇరాన్పై ప్రయోగించినట్లు తెలిపారు. గతంలో తాము ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేసినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపకుండా.. అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాటిని టెహ్రాన్ శివార్లలోని రహస్య భూగర్భ స్థావరంలో భద్రపరిచిందని తమకు కచ్చితమైన సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్కు చెందిన 300 క్షిపణి లాంచర్లను తాకాయని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆ దేశంలోని బాలిస్టిక్ క్షిపణి శ్రేణులు, వైమానిక రక్షణ వ్యవస్థలపై తమ వైమానిక దళాలు దాడులు కొనసాగిస్తున్నాయన్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన తాజా దాడులకు సంబంధించిన దృశ్యాలను ఐడీఎఫ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

**- రాహుల్కు మందకృష్ణమాదిగ లేఖ**



**వరంగల్,మార్చి4( వెలుతురు):**
రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అధికార గర్జన కూల్చే ఆకలి ఆర్టీసీ ది కాల్చే ఆవేదన కార్మికులది..!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ప్రజాస్వామ్యం అంటే ప్రజల ఆకాంక్షలను పాలనగా మార్చే రాజకీయ ప్రక్రియ. ప్రజలు తమ జీవితాలను ప్రభావితం చేసే విధానాలు, నిర్ణయాలు, చట్టాలు ప్రజల సంకల్పానికి అనుగుణంగా అమలవుతాయని నమ్మి తమ ఓటును వినియోగిస్తారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు చేసే వాగ్దానాలు కేవలం ప్రచార నినాదాలు కావు. అవి ప్రజలతో కుదిరే సామాజిక-రాజకీయ ఒప్పందాలు. ఆ ఒప్పందాన్ని అమలు చేయడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. కానీ ఆ హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత మరచిపోతే ప్రజాస్వామ్యం మాటలకే పరిమితమవుతుంది. మాటల ప్రజాస్వామ్యం ప్రజలకు న్యాయం చేయదు; కార్యాచరణ ప్రజాస్వామ్యం మాత్రమే ప్రజల జీవితాలను మార్చగలదు.
తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు వ్యక్తం చేస్తున్న ఆగ్రహం, అసంతృప్తి, నిరసన ప్రజాస్వామ్య ఒప్పందాల ఉల్లంఘనకు ప్రతిబింబంగా మారింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ వైఖరి మధ్య కనిపిస్తున్న విరుద్ధత కార్మికులను తీవ్రంగా ఆవేదనకు గురిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన కీలక హామీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న వాగ్దానం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 'అపాయింటెడ్ డే' ప్రకటిస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ప్రభుత్వం మౌనం వహించడం రాజకీయ నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ఆర్టీసీ సంస్థ తెలంగాణ ప్రజల జీవన రేఖ. ఇది కేవలం రవాణా వ్యవస్థ కాదు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవనాధారం, విద్యార్థులకు విద్యకు మార్గం, ఉద్యోగులకు ఉపాధికి దారి, మహిళలకు భద్రత, రైతులకు మార్కెట్కు చేరే సాధనం. ఈ సంస్థలో పనిచేసే వేలాది కార్మికులు తమ జీవితాలను ప్రజల సేవకు అంకితం చేశారు. వారి కుటుంబాల భవిష్యత్తు ఈ సంస్థ స్థిరత్వంపై ఆధారపడి ఉంది. అలాంటి సంస్థపై ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ.
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆర్టీసీ విలీనాన్ని ప్రధాన హామీగా ప్రకటించింది. ఆ హామీపై విశ్వాసంతో కార్మికులు, వారి కుటుంబాలు, ప్రజలు ఆ పార్టీకి మద్దతు తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత విలీనంపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం, టైమ్లైన్ ప్రకటించకపోవడం, అపాయింటెడ్ డే విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. విలీనం అంటే కేవలం రాజకీయ ప్రకటన కాదు, అది ఉద్యోగ భద్రత, వేతన స్థిరత్వం, పెన్షన్ భద్రత, సంస్థ అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయం. ఈ అంశంలో ప్రభుత్వ మౌనం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.
వేతన సవరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ కూడా అమలుకాకుండా పోయిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. 2021 నాటి వేతన సవరణను 30 శాతం ఫిట్మెంట్తో అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని గాలికి వదిలేయడం కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వేతన సవరణ కేవలం జీతం పెంపు కాదు; అది కుటుంబ జీవన ప్రమాణం, పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక గౌరవం వంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. వేతన సవరణను అమలు చేయకపోవడం అంటే కార్మికుల జీవితాలను నిర్లక్ష్యం చేయడమే.
2017 పీఆర్సీ ఏరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్క్యాష్మెంట్ డిఫరెన్సులు, ఇతర సెటిల్మెంట్లను ఇప్పటికీ పరిష్కరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరగడం మానవీయ విలువలకు విరుద్ధం. ప్రభుత్వ సేవ చేసిన ఉద్యోగులు జీవితాంతం ఎదురుచూడాల్సిన పరిస్థితి కల్పించడం అనైతికం. రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం అంటే వారి జీవితాంతం పొదుపులను, కుటుంబ భద్రతను ప్రమాదంలో పడేయడమే.
పెన్షన్, పీఎఫ్ సమస్యలు కార్మికుల్లో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. రిజెక్ట్ అయిన పీఎఫ్ అప్లికేషన్లను సరిచేయకపోవడం, డీడీలు కట్టిన వారికి పెన్షన్ మంజూరు కాకపోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం. పెన్షన్ అనేది దానం కాదు; అది ఉద్యోగి తన జీవితకాలంలో చెల్లించిన నిధులకు ప్రతిఫలం. వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. పెన్షన్ మంజూరు ఆలస్యం అంటే కార్మికులను వృద్ధాప్యంలో ఆర్థిక అసురక్షతకు నెట్టివేయడమే. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించకపోతే ప్రజల నమ్మకం పూర్తిగా కోల్పోతుంది.
'మహాలక్ష్మీ' పథకం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే ప్రజా సంక్షేమ కార్యక్రమం. మహిళల సామాజిక, ఆర్థిక సాధికారతకు ఇది ఒక కీలక అడుగు. కానీ ఈ పథకం అమలులో ఆర్టీసీ కార్మికులపై పడుతున్న పనిభారం, ఆర్థిక భారం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఆ భారాన్ని ఆర్టీసీ సంస్థపై మోపి, తగిన నిధులు విడుదల చేయకుండా ఉండటం న్యాయమా?
'మహాలక్ష్మీ' పథకం కింద ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ.2,500 కోట్ల పెండింగ్ బకాయిలు ఇంకా చెల్లించకపోవడం సంస్థను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టుతోంది. ప్రతి నెలా ఇవ్వాల్సిన రూ.350 కోట్లను కూడా కోత విధించకుండా చెల్లించకపోవడం సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. సంక్షేమ పథకాలు ప్రజలకు అవసరం. కానీ ఆ పథకాల భారాన్ని ప్రభుత్వ రంగ సంస్థలపై మోపడం సామాజిక న్యాయానికి విరుద్ధం. ప్రజల సేవ కోసం రోజుకు 16 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్న కార్మికులపై అదనపు పనిభారం మోపి, తగిన ప్రతిఫలం ఇవ్వకుండా ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.
ఉద్యోగ భద్రత అంశం ఆర్టీసీ కార్మికుల ప్రధాన ఆవేదన. చాలా కాలంగా కొత్త నియామకాలు లేకపోవడం వల్ల సిబ్బంది కొరత తీవ్రమైంది. ఈ పరిస్థితిలో 'మహాలక్ష్మీ' పథకం అమలుతో పనిభారం మరింత పెరిగింది. అయినా కార్మికులు సంస్థ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. కానీ వారికి ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ప్రభుత్వం బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోంది. ఉద్యోగ భద్రత అనేది కార్మికుల ప్రాథమిక హక్కు. తాత్కాలిక ఉద్యోగాలు, కాంట్రాక్ట్ విధానాలు కార్మికుల జీవితాలను అస్థిరతలో నెట్టేస్తాయి. ఆర్టీసీ వంటి కీలక సంస్థలో శాశ్వత నియామకాలు, ప్రమోషన్లు, శిక్షణ కార్యక్రమాలు లేకపోవడం సంస్థ భవిష్యత్తుకు ప్రమాదకరం.
కార్మిక సంఘాల పునరుద్ధరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకం. కార్మిక సంఘాలు కార్మికుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం, ప్రభుత్వంతో చర్చలు జరిపే వేదికలు. ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని కార్మికులు కోరుతున్నారు. సంఘాలపై ఆంక్షలు విధించడం లేదా నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. కార్మిక సంఘాలు బలంగా ఉంటేనే కార్మికుల హక్కులు రక్షించబడతాయి. ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజాస్వామ్య దృక్కోణంలో చూడాలి.
ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం రవాణా రంగంలో పర్యావరణానికి అనుకూలమైన కీలక మార్పు. కానీ ఈ బస్సులను ఆర్టీసీకి ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానం ప్రభుత్వ రంగ సంస్థల బలహీనతకు దారి తీస్తుంది. ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చేలా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. ప్రైవేటీకరణ పేరుతో ప్రజా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సామాజిక అసమానతలను పెంచుతుంది.
ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం నైతిక బాధ్యత మాత్రమే కాదు, రాజ్యాంగ బాధ్యత కూడా. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశం. ఆర్టీసీ కార్మికుల సమస్యలు కేవలం కార్మిక సమస్యలు కాదు; అవి ప్రజా సేవల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, పెన్షన్ సమస్యలు, బకాయిల చెల్లింపు, ఉద్యోగ నియామకాలు, సంఘాల పునరుద్ధరణ, ఎలక్ట్రిక్ బస్సుల మార్గదర్శకాలు వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి. టైమ్బౌండ్ అమలు, పారదర్శక విధానాలు, కార్మిక సంఘాలతో చర్చలు ఇవన్నీ ప్రజాస్వామ్య పాలనకు అవసరం.
ప్రజాస్వామ్యం ప్రజల నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. ఆ నమ్మకాన్ని కోల్పోతే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనమవుతుంది. ఆర్టీసీ కార్మికుల ఆగ్రహం ప్రజల ఆవేదనకు ప్రతిబింబం. ప్రభుత్వం ఈ ఆవేదనను పట్టించుకోకపోతే ప్రజల విశ్వాసం మరింత దెబ్బతింటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించాలి. మాటలతో కాదు, చర్యలతో ప్రజల నమ్మకాన్ని తిరిగి సంపాదించాలి. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం ద్వారా ప్రభుత్వం ప్రజా పాలనకు అర్థం కల్పించాలి.
ప్రజాస్వామ్యం మాటలతో నిలబడదు, కార్యాచరణతో నిలబడుతుంది. ఎన్నికల హామీలు అమలుకాకపోతే ప్రజల ఆగ్రహం సహజం. ఆర్టీసీ కార్మికుల ఆగ్రహం ప్రజాస్వామ్య వ్యవస్థకు హెచ్చరిక. ప్రభుత్వం ఈ హెచ్చరికను గంభీరంగా తీసుకుని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారమైతే అది కేవలం ఒక సంస్థ విజయం కాదు అది ప్రజాస్వామ్య విజయంగా మారుతుంది. ప్రజల ఆకాంక్షలను పాలనగా మార్చే ప్రక్రియ నిజంగా ప్రజాస్వామ్యమవుతుంది. మాటల ప్రజాస్వామ్యం కాదు, కార్యాచరణ ప్రజాస్వామ్యం కావాలి. అదే తెలంగాణ ప్రజల ఆకాంక్ష.

## ఘనంగా బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు





**హైదరాబాద్ వెలుతురు మార్చి 04:**
గత రెండు దశాబ్దాలుగా బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పాలమూరు ముద్దుబిడ్డ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్ గారి జన్మదిన వేడుకలు లక్డికపూల్ లోని బిసి భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి శ్రీనివాస్ ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విక్రం కనకాల శ్యామ్ కుర్మా బోల్లెపెల్లి స్వామి ప్రొఫెసర్ చలమల వెంకటేశ్వర్లు జాజుల భాస్కర్ పాల్గొని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మార్చి 16 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలి

**- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అగ్రకులాలకు న్యాయం చేస్తూ బీసీలకు అన్యాయం చేయడం సరికాదు**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 04:**
ఈనెల 16 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ రాత్రికి రాత్రి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కింద అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల న్యాయమైన డిమాండ్ నెరవేర్చడంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో బీసీలు విద్యా ఉద్యోగ రంగాల్లో వెనుకబడిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు నిజంగా కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, కిషన్ రెడ్డిలు బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలని అన్నారు.

## బాచుపల్లి లో భారీ అగ్ని ప్రమాదం.

**- రోడ్డు పక్కన ఉన్న ఫర్నిచర్ దుకాణాలు దగ్ధం భారీగా ఆస్తి నష్టం**

**- కోట్లలో ఆస్తి నష్టం రోడ్డున పడ్డ వ్యాపారులు**





**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మార్చి 04:**
బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ప్రగతి నగర్ కమాన్ సమీపంలో రోడ్ సైడ్ ఏర్పాటు చేసుకున్న ఫర్నిచర్ షాపుల్లో ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో పెను విధ్వంసం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఒక దుకాణంలో సిలిండర్ పేలడంతో మంటలు అదుపు తప్పాయి. ఆ మంటలు వేగంగా పక్కనే ఉన్న ఇతర షాపులకు విస్తరించి, చూస్తుండగానే సుమారు 40 నుంచి 50 దుకాణాలను బూడిద చేశాయి. ఈ ప్రమాదంలో ఫర్నిచర్ తయారీకి ఉపయోగించబడే కలప, ఫామ్, రసాయనాలు ఉండడంతో మంటలు తీవ్ర రూపం దాల్చాయి, రోడ్డు పక్కన చిన్న చిన్న షెడ్లలో ఏర్పాటు చేసుకున్న ఈ దుకాణాలన్నీ పూర్తిగా కాలిపోయాయి. దీనివల్ల సుమారు కోట్లాది రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. తమ జీవనాధారణమైన దుకాణాలు కాలి పోవడంతో వ్యాపారులు కన్నీరు మున్నీరవుతున్నారు. పేలుడు ధాటికి ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగ అలుముకుంది. ఆ మంటల ఉధృతికి భయపడి స్థానికులు ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు యంత్రాంగం కూడా ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టింది.

# అధైర్య పడవద్దు ఆదుకుంటాం

**- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**




**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మార్చి 04:**
బాచుపల్లి ప్రధాన రహదారిలోని కేజీఆర్ కన్వెన్షన్ వద్ద గల బాచుపల్లి ప్రధాన రహదారి పక్కన గల ఫర్నిచర్ దుకాణాలలో అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంతో రోడ్డున పడ్డ ఫర్నిచర్ షాప్ బాధితులను, సంఘటన స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పరామర్శించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటుచేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న వీరికి ఇలాంటి ఆకస్మాత్తు ప్రమాదాలు తీవ్ర ఆస్తి నష్టాన్ని కలిగించాయని, జిల్లా ఉన్నతాధికారులతో ఘటనపై చర్చించి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టి వారిని అందుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ రవికిరణ్, గాజుల సుజాత, స్థానిక నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, ప్రదీప్, వైఎస్, కురుమూర్తి, అంజన్ కుమార్, రవీందర్ బాబు, జయరాజ్, మహిళా నాయకురాలు లలితా రెడ్డి, క్రిష్ణ మంజరి తదితరులు పాల్గొన్నారు.

# మినీ మార్వెల్ బేబీస్ డే అవుట్‌తో సందడి







**తిరుమలగిరి వెలుతురు మార్చి 04:**
తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో చిన్నారుల కోసం నిర్వహించిన "మినీ మార్వెల్ బేబీస్ డే అవుట్" కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ప్రీప్రైమరీ నుంచి రెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, సమీప ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల నవ్వులు, కేరింతలతో కళకళలాడింది. పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినోదాత్మక ఆటలు, మినీ సైన్స్ మ్యాజిక్ ప్రయోగాలు, మ్యాజిక్ షో, జాయ్ రైడ్స్ చిన్నారులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలల పిల్లలు కూడా ఇతర విద్యార్థులతో కలిసి అన్ని కార్యక్రమాల్లో భాగమై ఆనందంగా గడిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా పరస్పర స్నేహభావాన్ని పెంచుతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. వినోదంతో పాటు సామాజిక అనుబంధాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. చివరగా పిల్లల ఆనంద కేరింతల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సమాజం మధ్య బంధాన్ని మరింత బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

**- ప్రజల ప్రాణాలతో చెలగాటం**

**- వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**శంకర్పల్లి, వెలుతురు మార్చి 04 :**
మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డు బుల్కాపూర్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని ప్రజల ఆరోగ్యానికి ముప్పుకు గురి చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఏర్పడక ముందు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ అదే విధంగా కొనసాగుతుండటంతో, ఆధునిక అవసరాలకు సరిపోక తీవ్ర సమస్యలకు దారి తీస్తోందని వారు ఆరోపిస్తున్నారు. అలాగే స్థానికంగా పేరుకుపోతున్న చెత్త చెదారం, మూసుకుపోయిన కాలువలు, నిల్వ నీరు కారణంగా దోమల బెడద పెరిగి ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధ పడుతున్నారని వాపోతున్నారు. చిన్నపిల్లు, వృద్ధులు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి, ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థను అండర్ డ్రైనేజీగా మార్చి చెత్త నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తక్షణమే ఫాగింగ్, శానిటేషన్ చర్యల చేపట్టి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



### అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

**మద్దూరి శేఖర్, బుల్కాపూర్ నాల్గవ వార్డు బీఆర్ఎస్ నాయకులు**

గ్రామపంచాయతీ కాలంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థను మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత కూడా ఆధునీకరించక పోవడం బాధాకరం. దాదాపు 30 సంవత్సరాలు గడిచినా సమస్యను పరిష ప్రతినిధులు సరైన చర్యలు తీసుకోలేదు. ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా అధికారులు అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన మేడ్చల్ జిల్లా ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె రాజు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి)మార్చి 04:**
ప్రజా పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సమక్షంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం టిఆర్ఎస్ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు చేరారు. ఈసందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ కొత్త నాయకులను కలుపుకొని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారికి మంచి గుర్తింపు ఇస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్, సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, రషీద్, లక్ష్మారెడ్డి, బట్ట పాలకృష్ణ, మైసిగారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.





నూతనంగా స్పెషల్ కమిషనర్ లేబర్ డిపార్ట్మెంట్ కి బాధ్యతలు చేపట్టిన శ్రీమతి పమేలా సత్పతి ఐఏఎస్ గారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశాం. ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్. హైదరాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

**హైదరాబాద్ వెలుతురు మార్చి 04:**

## వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో హోలీ వేడుకలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 04:**
బుధవారం రోజున హోలీ పండుగ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ లోని నెలకుట్టి పార్క్ లో కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డ కార్యక్రమానికి హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మేలుకోటి పార్క్ వాకర్స్ అసోసియేషన్ మరియు సభ్యులకు హోలీ ఆడడం జరిగింది.

## మోకిలతండా సర్పంచ్ శాంతమ్మ బాధ్యతల స్వీకరణ

**- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో సస్పెన్షన్ ఎత్తివేత**



**శంకర్పల్లి, వెలుతురు మార్చి 04 :**
మండల పరిధిలోని మోకిలతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ శాంతమ్మను తిరిగి పదవిలో నియమిస్తూ జిల్లా కలెక్టర్ (పిడబ్ల్యూ) ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించడం, అనుమతి లేని కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఆరోపణలపై గతంలో ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలను అనుసరించి, పంచాయతీరాజ్ చట్టం కింద కొనసాగుతున్న విచారణ పెండింగ్లో ఉండగానే ఆమె సర్పంచ్గా బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇకపై శాంతమ్మ, ఉపసర్పంచ్ కవిత చేసే సంతకాలతో జారీ చేసే చెక్కులను ఆమోదించాలని సబ్ ట్రెజరీ అధికారి మరియు సంబంధిత బ్యాంకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉప సర్పంచ్ బాధ్యతలను వెంటనే శాంతమ్మకు అప్పగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శాంతమ్మకు సర్పంచ్ బాధ్యతలను అధికారికంగా అప్పగించింది.

## హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

**- సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన రాజాసింగ్**



**హైదరాబాద్,మార్చి4( వెలుతురు):**
హిందు పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందుకని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

# ఆరోగ్య లక్ష్మి కమిటీ ఏర్పాటు





**గుండాల మార్చి. 4(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోనీ మరిపడిగా గ్రామంలో ఆరోగ్య లక్ష్మి పథకం సమర్థవంతమైన అమలుకు సర్పంచ్ ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఈ కమిటీ కీలకంగా పనిచేయనుంది. ఈ కమిటీలో మొత్తం 11 మంది సభ్యులతో కమిటీని రూపొందించారు. సర్పంచ్ ఛైర్‌పర్సన్‌గా, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా బాధ్యతలు చైర్ పర్సన్ గా గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్. కన్వీనర్ గా అంగన్వాడి టీచర్లు కాలమ్మ, స్వరూప, నిర్వర్తించనున్నారు. మిగతా తొమ్మిది మంది సభ్యులుగా గ్రామానికి చెందిన ప్రతినిధులను ఎంపిక చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపు కమిటీ సమావేశం నిర్వహించి, పథకం అమలుపై సమీక్ష చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి స్కూల్ ఉపాధ్యాయులు ధనలక్ష్మి . యాదగిరి కమిటీ సభ్యులు భాగ్యమ్మ, పూజిత, వెన్నెల, సంధ్య, శిరీష ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందుతున్న సేవలు సమర్థవంతంగా అమలవుతూ, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామ ప్రజలు కూడా కమిటీకి సహకరించాలని కోరారు.

## నూతన వధువు వరులను ఆశీర్వదించిన మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 04:**



కొమ్మాయిగూడెం వాస్తవ్యులు బిజెపి సీనియర్ నాయకులు గోపగోని ధర్మరాజు కూతురు సుష్మ స్వరాజ్ పెళ్లి కి హాజరై నూతన వధూవరునని ఆశీర్వదించిన మాజీ పార్లమెంట్ సభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య దావూనూరి వెంకటేష్, కట్ట యాదయ్య, కంభంపాటి శివరంజన్, రేపాక లింగస్వామి, గుండాల నరేష్, మచ్చ మహేష్, మోటి రాజయ్య ,బందెల సంజీవ, హరిబాబు, మేడి పరుశురాం బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలకు 50 సంవత్సరాలు దాటితే పించన్ ఇవ్వాలి.

**- తెలంగాణ తెలుగుదేశ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ**

**- రామన్నపేట మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్**

**- ఎంపీడీవో ఆఫీసులో సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 04:**



ప్రభుత్వం పద్మశాలీలకు ఇస్తున్నటువంటి 50 సంవత్సరాలు దాటితే ఇస్తున్న ఆసరా పెన్షన్ విషయంలో జియోట్యాగ్ నెంబర్ తప్పనిసరి అని దరఖాస్తులు స్వీకరించని కారణంగా ఇట్టి విషయంలో ప్రభుత్వం జియోట్యాగ్ తప్పనిసరి ఉండాలని ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో కాపీని అందించాలని సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) ఇవ్వాలని రామన్నపేట ఎంపీడీవో ఆఫీస్ లో సూపరిండెంట్ శ్రీనివాస రెడ్డి కి తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా నేత వినతి పత్రం సమర్పించారు. ఇట్టి విషయంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పద్మశాలీలకు మగ్గం నేసే ఒకరికి జియో టాగ్ నెంబర్ వేస్తూ అతనికి ఒక హెల్పర్కు మాత్రమే అవకాశం ఇచ్చిందని. మిగతా చేనేత వృత్తిలో పనిచేస్తున్నటువంటి చేనేత కార్మికులకు జియోట్యాగ్ నెంబర్ వేయలేదని అన్నారు.ఇట్టి విషయంలో జియోట్యాగ్ నెంబర్ లేని పద్మశాలీలు దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు... కాబట్టి ప్రభుత్వం ఇచ్చేటటువంటి పెన్షన్ అతను పద్మశాలీనా కాదా వృత్తిలో పనిచేశాడా లేదా గ్రామాల్లో కార్యదర్శిల ద్వారా లేదా గ్రామాల్లో ఉన్నటువంటి చేనేత సహకార సంఘాల ద్వారా ధ్రువీకరణ చూసుకొని అందరికీ పెన్షన్ ఇవ్వాలని అన్నారు..ఈ యొక్క కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రామన్నపేట మండల శాఖ అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్ తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు బత్తుల సత్యం రామన్నపేట పట్టణ శాఖ అధ్యక్షులు దిండిగల రాములు నాయకులు రాపోలు విశ్వనాథం పాల్గొన్నారు..

## రాజమాత ఫౌండేషన్ వితరణ



**మోత్కూర్, మార్చి 4,(వెలుతురు న్యూస్ ):**
మోత్కూర్ మండలం లో దాచారం, పాటిమట్ల గ్రామాలలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో రాజమాత ఫౌండేషన్ టీం సభ్యులు పదవ తరగతి విద్యార్థులకు 12000/- రూపాయల విలువైన ఎగ్జామినేషన్ మెటీరియల్ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఉదయ్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ మనోజ్ రెడ్డి కో ఆర్డినేటర్ పూజిత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం,ఉపాధ్యాయులు నర్మద,వీరయ్య, ఆనంద కుమార్,నాగరాజు, సైదులు మరియు యగ్నేష్ పాల్గొన్నారు. విద్యార్థులు రాజమాత ఫౌండేషన్ టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ ను కలిసిన : మేడి కృష్ణయ్య



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 04:**
నల్గొండ జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంద క్రిష్ణ మాదిగ ని ఎల్లారెడ్డి గూడెం గ్రామ యువకులు మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, సామాజిక సమస్యలు, యువత పాత్రపై ఆయనతో చర్చించారు. కలిసిన వారిలో మేడి కృష్ణయ్య, పట్ల సుధాకర్, తోటకూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 23న బీసీల చలో ఢిల్లీ

**- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**

**మునుగోడు వెలుతురు మార్చి 04:**



బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని ప్రధాన డిమాండ్ తో ఈనెల మార్చ్ 23న వేలాది మందితో బీసీల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు బుధవారం రోజున మునుగోడు మండల కేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు బీసీలు సుదీర్ఘకాలంగా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని పోరాటం చేస్తున్నారని బీసీల పోరాటానికి స్పందించిన ప్రభుత్వం 42% రిజర్వేషన్ పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఢిల్లీకి పంపించి సంవత్సరన్నర కాలం అయినప్పటికీ నీటి వరకు బీసీ రిజర్వేషన్ల బిల్లు చట్ట రూపంలో రాకపోవడం చాలా దురదృష్టకరమన్నారు బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచడానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్ సమావేశాలలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టాలని రాము డిమాండ్ చేస్తే, రెండు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీ ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేట్ బిల్లు పెడతామని హామీ ఆమె ఇవ్వడానికి స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఢిల్లీ పాలకులపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 23న ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద బీసీల మహాదమ్లను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు ఈ మహా ధర్నాకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి రాజకీయ పార్టీల కచ్చితంగా బీసీలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు బూడిద లింగయ్య యాదవ్, నాయకులు ఆనగంటి కృష్ణ, బూడిద మల్లికార్జున్, ఈదులకంటి కైలాస్ వీరమల్ల కార్తీక్, గురుజా నరసింహా గౌడ్, కర్నాటి వెంకటేష్, సత్యం, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

## గరుడ వాహనం పై శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి





**మోత్కూర్, మార్చి 4,(వెలుతురు న్యూస్ ):**
మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు గరుడ వాహనం పై స్వామి వారిని ఊరేగించే కార్యక్రమాన్ని మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ ఛైర్మన్ పల్లెర్ల వెంకన్న,దేవాలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్ర గౌడ్ ప్రారంభించారు. ఈ ఊరేగింపు కోలాట బృందం తో పద్మశాలి కాలని, డ్రైవర్స్ కాలనీ,శ్రీ వెంకటేశ్వర కాలనీ,వడ్డెర కాలనీ, సుందరయ్య కాలనీ, అంగడి బజారు, మున్సిపాలిటీ కార్యాలయం, చెరువు కట్ట ప్రాంతాల గుండా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉపాధ్యక్షుడు బుర్ర యాదయ్య, బయ్యని రాజు, ఉయ్యాల అంజయ్య, బుర్ర కృష్ణా,గుండు శ్రీను మందుల సురేష్,బుర్ర నర్సయ్య,జన్నురు బిక్షపతి, జెనిగల శ్రీను, బిల్లపాటి మహేందర్ రెడ్డి,శివ, బోయిని వెంకన్న, వంగాల బాబు, కమిటీ సభ్యులు పాలోజు శేఖర చారి, బందేలరవి,పోచం అంజయ్య , తోట్ల యాదగిరి తదితరులు ఉన్నారు.

## మల్గి గ్రామంలో హోలీ సంబరాలు వైభవంగా ఉట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దల సందడి...

**జహీరాబాద్ వెలుతురు మార్చి 04:**
సంగారెడ్డి జిల్లా మల్గి గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామపంచాయితీ కార్యాలయం ఎదురుగా ఘనంగా ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో కొనసాగుతున్న ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జట్గొండ అనిల్ ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. గ్రామంలో చిన్నారులు, యువతులు, పెద్దలు రంగులతో ఒకరినొకరు అలంకరించుకుంటూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి, మాజీ ఎంపిటిసి శివనంద శ్రీపతి ముఖ్య అతిథులుగా హాజరై ఉట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హోలీ పండుగ మనసుల్ని కలిపే పండుగగా, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. యువత




సాంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యువ నాయకులు శ్రీకాంత్, నగేష్, సిద్ధు, ఆకాష్ తదితరులు చురుకుగా పాల్గొని వేడుకలకు ఊపు తీసుకొచ్చారు. చిన్నారులు ఉట్టి కొట్టడంలో ఉత్సాహంగా పాల్గొనగా, గ్రామ ప్రజలు వారిని అభినందించారు.

## పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి

**- 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్ పిలుపు...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 04:**
జహీరాబాద్ పురపాలక సంఘ పరిధిలోని 36వ వార్డు ప్రజలకు బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్ కీలక విజ్ఞప్తి చేశారు. మనం చెల్లించే ఇంటి పన్ను, ఆస్తి పన్నుల ద్వారానే మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయం సమకూరుతుందని, అదే ఆదాయంతో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. వార్డులో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమ నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి పన్నుల ఆదాయం కీలకమని తెలిపారు. పన్నులు సకాలంలో చెల్లించని పక్షంలో అభివృద్ధి పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా పన్నులు చెల్లించడం ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వామి కావాలని కోరారు. ప్రజల సహకారం ఉంటేనే వార్డును ఆదర్శ



వార్డుగా తీర్చిదిద్దగలమని అన్నారు. పన్నుల చెల్లింపు విధానం, బకాయిల వివరాలు లేదా ఇతర సందేహాల విషయంలో ఇబ్బందులు ఎదురైతే తనను నేరుగా సంప్రదించవచ్చని వారు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

## జహీరాబాద్ వార్డ్ నం.21లో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- సీసీ డ్రెయిన్, 6 కల్వర్ట్ నిర్మాణంతో డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం...**

**జహీరాబాద్,**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ సూచనల మేరకు జహీరాబాద్ మున్సిపాలిటీ వార్డ్ నం.21 పరిధిలోని ఫయాజ్ నగర్ కాలనీ, జమ్ జమ్ కాలనీ, నేతాజీ నగర్ కాలనీల్లో సీసీ డ్రెయిన్ మరియు 6 కల్వర్ట్ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. వార్డ్ నం.21 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ ప్రతినిధిత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. కాలనీల్లో దీర్ఘకాలంగా నెలకొన్న డ్రెయినేజీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు.



వర్షాకాలంలో రహదారులపై నీరు నిల్వవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సీసీ డ్రెయిన్ మరియు కల్వర్ట్ నిర్మాణంతో వర్షపు నీరు సక్రమంగా పారుదల అవుతూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం తమ లక్ష్యమని, ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి జావేద్, ఎం.డి అర్షాద్, ఎం.డి గౌస్ (గైబు భాయ్), సయ్యద్ సజ్జాద్, అజీమ్ భాయ్, మెహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గీతా కార్మికుడు కొంపెల్లి నరసింహ గౌడ్ కు తీవ్ర గాయాలు



**మునుగోడు వెలుతురు మార్చి 04:**
ప్రమాదవశాత్తు గీత కార్మికుడు కొంపెల్లి నరసింహ లక్ష్మీదేవి గూడానికి చెందిన ఆయన రోజువారీగా తాడిచెట్టు ఎక్కడంతో పై నుండి జారీ కింద పడడంతో రెండు కాళ్లు విరిగి బలమైన గాయాలు కావడంతో అంబులెన్స్ 108 లో చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు.

## సీతారాంపురం అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం



**గుండాల, మార్చి 4(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాళీ పద్మ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అంగన్వాడీ ద్వారా గర్భిణీలు,బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జీ. వాణి, ఏఎన్ఎం రేణుక,ఆశ వర్కర్లు కవిత, లావణ్య, ఆయాలు మంజుల, సుశీల, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

**- పదిమంది కూలీలకు గాయాలు**

**రాజన్న సిరిసిల్ల,మార్చి4( వెలుతురు):**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ కూలీలపై తేనె టీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వవరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం ఉదయం ఉపాధి పనుల్లో భాగంగా సర్వాయి కాలువ మరమ్మతు పనులను చేపట్టారు. దాదాపు 10 మంది కూలీలు అక్కడ పనిచేస్తుండగా చెట్టుపై ఉన్న తేనె టీగలు వారిపై దాడి చేశారు. తేనె టీగలు మీదకు రావడంతో భయపడిపోయిన కూలీలు అక్కడి నుంచి పరుగులు తీశారు. అప్పటికే వారిని తేనెటీగలు విపరీతంగా కుట్టాయి. ఇది గమనించిన తోటీ కూలీలు.. గాయపడిన వారిని కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. కానీ అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. పైగా ప్రభుత్వ అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇక చేసేదేమీ లేక.. గాయపడిన వారిని ట్రాలీ ఆటోలో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి వెంట సర్పంచ్ సింగం శ్రీహరి, ఉపసర్పంచ్ లంబ రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ వెళ్లారు. వారికి మెరుగైన వైద్యం అందిచేలా చూడాలని వైద్యులను కోరారు. కాగా, తేనేటీగల దాడిలో గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారిలో పులి పాలవ్వ అనే వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## పరకాల మా అడ్డా

**- సురేఖ అక్కడి నుంచే పోటీ చేస్తారు: కొండా మురళి**

**వరంగల్,మార్చి4( వెలుతురు):**
పరకాల మా అడ్డా అని, వచ్చే ఎన్నికల్లో కొండా సురేక అక్కడి నుంచే పోటీ చేస్తారని మాజ ఎమ్మెల్సీ, తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త మురళీ కీలక వ్యాఖ్యలు చేశారు. పరకాల తమ అడ్డా... వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచే కొండా సురేఖ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బుధవారం గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో కొండా మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన బిడ్డా కొండా సుస్మిత ఎవరినైనా ఎదిరిస్తుందని చెప్పుకొచ్చారు. తనకన్నా కొండా సుస్మిత ధైర్యవంతురాలని తెలిపారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఎవర్నీ వదలిపెట్టదని అన్నారు. ఎంతటివారినైనా ధైర్యంగా ఎదుర్కొంటుందని కొండా మురళీ పేర్కొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో భర్త వేధింపులు తట్టుకోలేక జోగు సంధ్య ఆత్మహత్య

**మంచాల వెలుతురు మార్చి 04:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జోగు సంధ్య అనే మహిళ భర్త వేధింపులు తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జోగు సంధ్య భర్త జోగు సుదర్శన్ వీళ్లకు ముగ్గురు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు సుదర్శన్ వృత్తిరీత్యాఆటో డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు భార్య జోగు సంధ్య ఆరుట్ల గ్రామంలో కిరాణా దు కాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంది సుదర్శన్ ప్రతిరోజు మద్యం సేవించి రావడం ఇం ట్లో డబ్బులు అడగడం భార్యను కొట్టడం లాంటి చిన్న చిన్న గొడవలు భార్యాభర్తల మధ్య గత 15 సంవత్సరాల నుండి గొడవలు జరుగుతున్నాయి చాలాసార్లు పోలీస్ స్టేషన్లో జోగు సంధ్య ఫిర్యాదు చేసిన గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుని రాజీపడి ఫిర్యాదు వెనక్కి తీసుకునేవా ళ్లు గతంలో చాలాసార్లు భర్త వేధింపులు తట్టుకోలేక సంధ్య చాలాసార్లు ఆత్మహత్యకు పాల్పడిం ది మంగళవారం రాత్రి గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది ఈ విషయం తెలుసుకున్న కు టుంబ సభ్యులు స్థానికులు హైదరాబాద్ హాస్పిటల్ కు తీసుకెళు తుండగా మార్గమధ్యలోసంధ్య మరణించింది అని కుటుంబ సభ్యులు తెలిపారు సంధ్య కూతురు కొడుకు పోలీస్ స్టేషన్లో ఆ త్మహత్యపై ఫిర్యాదు చేశారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మం చాల సీఐ మధు తెలిపారు

# కామారెడ్డి లో శ్లోక పాఠశాలకు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం అందజేత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 4**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ కు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం -2026 ను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) మరియు కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, ఐవిఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ సహకరించడం జరుగుతుందని,పాఠశాల అంటే కేవలం విద్య మాత్రమే కాదని విద్యతో పాటుగా సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ఎంతగానో అభినందనీయమని అన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించాలంటే చాలామంది సహాయ, సహకారాలు అవసరం అవుతాయని,రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్న వారందరికీ అవార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు.తల సేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉందని అలాంటి చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి రాబోయే రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని అన్నారు.ఈ శిబిరాలను విజయవంతం చేయడానికి సామాజిక సేవకులు,రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# హోతీ (బి) గ్రామంలో ఘనంగా 13వ రంజాన్ ఇఫ్తార్ విందు

- మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పవిత్ర కార్యక్రమం...
- హాజరైన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనిస్, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు...
- పాల్గొన్న జహీరాబాద్ ఉర్దూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సయ్యద్ జమీరుద్దీన్...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 04:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని హోతీ (బి) గ్రామంలో 13వ రంజాన్ సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందు మరియు ప్రత్యేక భోజన కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన మహమ్మద్ అల్లావుద్దీన్ నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ముస్లిం సోదరాభిమానంతో పాటు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ పవిత్ర వేడుకకు జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనిస్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షను విరమించారు. ఇఫ్తార్ సమయానికి ప్రార్థనలు నిర్వహించగా, అనంతరం ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై వేడుకను మరింత వైభవంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనిస్ మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, దాతృత్వం మరియు దానధర్మాలకు నిలయమని పేర్కొన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడంతో పాటు పేదల పట్ల కరుణాభావం పెంపొందుతుందని తెలిపారు. ఇలాంటి ఇఫ్తార్ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పాల్గొనడం సమాజంలో మతసామరస్యం, సోదరభావం బలపడటానికి దోహదపడుతుందని ఆయన వివరించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ఒకే చోట చేరి ప్రార్థనలు చేయడం సమానత్వానికి నిదర్శనమని కొనియాడారు. జహీరాబాద్ ఉర్దూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సయ్యద్ జమీరుద్దీన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో సామూహిక ఇఫ్తార్ విందులు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, పరస్పర గౌరవాన్ని పెంచుతాయని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృత్వాలతో జీవించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో తమ ఆహ్వానాన్ని స్వీకరించి విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనిస్, కౌన్సిలర్లు, జర్నలిస్టులు మరియు ఇతర అతిథులందరికీ కార్యక్రమ నిర్వాహకులు మహమ్మద్ అల్లావుద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇఫ్తార్ విందును విజయవంతం చేయడంలో సహకరించిన హోతీ (బి) గ్రామ ముస్లిం సోదరులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం అతిథులందరికీ ప్రత్యేక భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: జహీరాబాద్ ఉర్దూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సయ్యద్ జమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు మొహమ్మద్ జహంగీర్, మొహమ్మద్ అక్రమ్, మహమ్మద్, మహమ్మద్ నిజాముద్దీన్, మోతిరామ్, ఫర్హాన్ ఖాద్రి, జహీరుద్దీన్, జహీరాబాద్ పత్రికా రిపోర్టర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఒక సంస్థ కాదు భారత భవిష్యత్తు

**- బొంగు రఘు గౌడ్ బిజెపి రాష్ట్ర నాయకులు**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మార్చి 04:**



1951లోనే ఆర్ ఎస్ ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) చైనా గురించి భారత దేశాన్ని హెచ్చరించింది.కానీ కాంగ్రెస్ దాన్ని విస్మరించింది. దాని ఫలితమే 1962 లో యుద్ధం, 1950 సం"ర ప్రారంభములో కమ్యూనిస్ట్ చైనా టిబెట్ పై దాడి చేసిన కొద్ది కాలానికే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ యొక్క రెండవ సర్ సంగ్ చాలక్ అయిన గురూజీ ప్రసిద్ధి చెందిన ఏం ఏస్ గోవాల్కర్ గారు చైనా విస్తరణ వాద దేశమని దాని తదుపరి లక్ష్యం భారత దేశమని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. మరలా 1951 లో కర్ణాటకలోని శివమొగ్గ పర్యటన సందర్భముగా చైనా భారత దేశంనకు ప్రత్యక్ష సైనిక ముప్పు అని ఆయన విలేకరులకు బహిరంగంగా చెప్పారు. ఇది 1962 యుద్ధానికి 11 సం"రాల ముందు జరిగింది. కానీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇతర ప్రణాళికలు కొన్ని ఉన్నాయి. నెహ్రూ హిందీ--చినీ భాయ్ భాయ్ నినాదాన్ని ముందుకు తెచ్చారు. 1954లో పంచశీల ఒప్పందం పై సంతకం చేసి సంఘర్షణకు బదులుగా పరస్పర సామరస్యాన్ని ప్రోత్సహించారు. కానీ పదే పదే వచ్చిన హెచ్చరికలను విస్మరించారు. 1962 కి ముందే ప్రమాద సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. కైలాస్-మానస సరోవర స్పష్టంగా కనిపించాయి. కైలాస్ మానస సరోవరం సమీపములో చైనా స్థానిక స్థావరాలు వెలిశాయి. అక్కడ భారతీయ యాత్రికుల ను చైనా సైనికులు తనిఖీ చేశారు. ఈ వాస్తవాలు భారతీయ ప్రచురణలలో నమోదు చేయ బడ్డాయి. గురూజీ స్వయంగా గమనించారు. ఆ తర్వాత తుది హెచ్చరికలు వచ్చాయి. 1962 అక్టోబర్ 16న, చిత్తోర్ గడ్ లో, 1962 అక్టోబర్ 18 న ఆళ్వార్ లో ఆయన హెచ్చరికలు పునరావృతం చేశారు. కేవలం రెండు రోజుల తర్వాత, 1962 అక్టోబర్ 20 న ఆల్ ఇండియా రేడియో పూర్తి స్థాయి చైనా దాడిని ప్రకటించింది. అప్పటి వరకు ఆయన చేసిన హెచ్చరికల ను ఎగతాళి చేశారు. కొందరు రచయితలు నిరాధారమైన పుకార్లని చెప్పారు కానీ కొద్ది రోజుల్లోనే వాస్తవం కళ్ళ ముందు నిలిచింది. దాడి జరిగిన తర్వాత 7---8 మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు రహస్యంగా ఢిల్లీలో గురూజీ నీ కలిసి సహాయం కోరారు. స్వయం సేవకులు (అర్ ఎస్ ఎస్)వెంటనే రంగం లోకి దిగి సైన్యానికి లాజిస్టిక్, రవాణా, రక్తదానం, దేశ వ్యాప్తంగా పౌర సహాయం అందించడం ద్వారా మద్దతు ఇచ్చారు. 1962 అక్టోబర్ 30న గురూజీ లాంఛనంగా జవహర్ లాల్ నెహ్రూ కు పూర్తి సహకారాన్ని అందించారు. చైనా, భారత్ యుద్ధ సమయములో పూర్తిగా మద్దతు అందించినందున ఆర్ ఎస్ ఎస్ వారు 1963 జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవ పెరేడ్ లో పాల్గొన్నారు. కానీ భారత దేశం ఆ యుద్ధం లో 38000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, లెక్కలేనన్ని ప్రాణాలను కోల్పోయింది. ఇది విధి కాదు, ముందు చూపును విస్మరించినందుకు చెల్లించిన మూల్యం.

# మంచాల మండలంలో వివిధ గ్రామాల్లో హోలీ పండుగ సంబరాలు



బండ లేమూర్ గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లొంగరి మల్లేష్



ఆరుట్ల గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్



ఆరుట్ల గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న మహిళలు చిన్నారులు

**మంచాల వెలుతురు మార్చి 04:**

మంచాల మండలం వివిధ గ్రామాల్లో హోలీ పండుగ సంబరాలు కుల మతాలకు అతీతంగా ఘ నంగా జరుపుకున్నారు యువకులు మహిళలు చిన్నారులు వివిధ రకాల రంగులు చల్లుకుంటూ వివిధ గ్రామాల్లో గ్రామ సర్పంచులు వార్డు సభ్యులు హోలీ పండుగ సంబరాలు ఘనంగా నిర్వ హించారు



పటేల్ చెరువు తండా గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ మేఘవత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్

# శబ్ద కాలుష్యంపై ప్రత్యేక చర్యలు

- కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తాలో మాడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం
- ఆకతాయిల ఆగడాలకు చెక్
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- సైలెన్సర్లు మార్పు చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదు
- కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ఐపిఎస్ వెల్లడి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 4**



కామారెడ్డి పట్టణంలో ఇటీవలి కాలంలో ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చడం వల్ల అధిక శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆకస్మికంగా వచ్చే అధిక శబ్దం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా రోడ్డు ప్రమాదాలకు కూడా దారితీసే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో బుధవారం నాడు కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో అదనపు ఎస్పీ బి. చైతన్య రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలో, పట్టణ సీఐ ఎస్.ఎస్. నరహరి సమక్షంలో మాడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంస కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ బి. చైతన్య రెడ్డి, ఐపీఎస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలకు చట్టవిరుద్ధంగా మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చడం నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి వాహనాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం (ఐతీబఅని & ఐతీఅజవ) వంటి నేరాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వాహనదారు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పట్టణ ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే విధంగా శబ్ద కాలుష్యం సృష్టించే వారిని ఏమాత్రం సహించబోమని, అట్టి వాహనాలను వెంటనే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంతత కోసం ఇటువంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఎస్.ఎస్. నరహరి, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎం ఎల్ ఏ రమణారెడ్డి తో నాకు ప్రాణ భయం ఉంది

- రక్షణ కల్పించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 4**



ఎమ్మెల్యే రమణారెడ్డి ఒక అవినీతి చక్రవర్తి ప్రాణహాని తలపెట్టి సానుభూతి డ్రామాలాడుతున్నారు అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీరెడ్డి మహేందర్ రెడ్డి ఫైర్ అయ్యారు. కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి రాజకీయ ముసుగులో సాగిస్తున్న అరాచకాలు, అవినీతి దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీరెడ్డి మహేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రమణారెడ్డిపై నిప్పులు చెరిగారు. తన అవినీతి సామ్రాజ్యం కూలిపోతుందనే భయంతోనే రమణారెడ్డి తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రమణారెడ్డి కేవలం ఒక ఎమ్మెల్యే కాదు, ఆయనో పెద్ద అవినీతి తిమింగలం అని మహేందర్ రెడ్డి విమర్శించారు. ఇన్నాళ్లు ఆయన అక్రమాలతో ఇబ్బంది పడ్డ బాధితులు ఇప్పుడు ధైర్యంగా బయటకు వస్తున్నారు. ఈ పాపాలు ఎక్కడ బట్టబయలు అవుతాయో అన్న వణుకు రమణారెడ్డిలో మొదలైంది అని ఎద్దేవా చేశారు. గూండాలతో దాడి చేయించి బాధితుడినే నిందితుడిగా మార్చారు ఎమ్మెల్యే రమణారెడ్డి మరియు 8వ వార్డు కౌన్సిలర్ ఏనుగు శ్రీధర్ రెడ్డి తనను పదేపదే ఫోన్ చేసి పిలిపించారని మహేందర్ రెడ్డి వెల్లడించారు. కామారెడ్డి అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని రమ్మంటే, ఒక మధ్యవర్తిలా నేను వెళ్లాను. కానీ, అక్కడ వందలాది మంది బీజేపీ కార్యకర్తలతో నాపై దాడి చేయించి, నన్ను బలిపశువును చేశారు. 65 ఏళ్ల వయసున్న నేను ఒక్కడినే వందలాది మంది ఉన్న చోటికి దాడికి వెళ్తానా ఇది రమణారెడ్డి ఆడుతున్న పక్కా ప్లాన్ అని ఆరోపించారు. దమ్ముంటే గుడిలో ప్రమాణం చేద్దాం రండి నేను దాడి కోసం వెళ్లలేదని పచ్చిబట్టలతో గుడిలో ప్రమాణం చేస్తాను. నన్ను పిలవలేదని రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి ప్రమాణం చేయగలరా? రమణారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఘటనలో నా వెంట ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఉన్నా.. ఇంద్ర చౌక్ నుండి రమణారెడ్డి ఇంటి వరకు నేను ముక్కు నేలకు రాస్తాను. రమణారెడ్డి ఊసరవెల్లి రాజకీయం ప్రజలు గమనిస్తున్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన రమణారెడ్డి ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికే ఈ హత్యాయత్నం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో విద్యార్థి ఉద్యమాల సమయంలో రమణారెడ్డి కుటుంబాన్ని కాపాడింది షబ్బీర్ అలీ గారని గుర్తు చేశారు. ఇంతటి దిగజారుడు చిల్లర రాజకీయం చేస్తాడని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రమణారెడ్డి వల్ల నాకు ప్రాణహాని ఉంది, పోలీసుల రక్షణ కావాలి. నా కారును ధ్వంసం చేసి, నాపైనే అక్రమ కేసులు పెట్టడం రమణారెడ్డి అహంకారానికి నిదర్శనం. ఈ ఊసరవెల్లి రంగులు ప్రజల ముందు బయటపడ్డాయి. ఈ అక్రమ కేసులపై నేను న్యాయపోరాటం చేస్తాను, రమణారెడ్డి నిజస్వరూపం బయటపెట్టే వరకు నిద్రపోను అని మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి మండల అధ్యక్షులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, బిక్నూర్ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఐరన్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు వినతి

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యే విదంగా చర్యలు తీసుకోవాలి...
- మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్, టిపిఓ అధికారి నియామకం చేపట్టాలి...
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు విజ్ఞప్తి చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ హన్నన్ జావీద్...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 04:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని నూతనంగా ఏర్పడిన కోహిర్ పురపాలక సంఘంలో గత రెండు నెలలుగా నిలిచిపోయిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యే విదంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, ముఖ్యంగా కోహిర్ మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులను నియమించడంతో పాటు కార్యాలయంలో సరిపడే సిబ్బందిని నియమించి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం విస్తృతమైన చర్యలు తీసుకోవాలని కోహిర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నన్ జావీద్ బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కోరుతూ అంశాల వారిగా వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రస్తుతం ఇంచార్జ్ కమిషనర్ ను నియమించి పాలన పరంగా ఇబ్బందులు లేకుండా చూస్తూ త్వరలో కోహిర్ మున్సిపల్ కు శాశ్వత కమిషనర్ ను నియమిస్తామని, అక్కడ ఉన్న సమస్యల పరిష్కరానికి సమూలంగా చర్యలు తీసుకుంటామని, శాఖల వారిగా సమస్యలను నివేదించి పరిష్కరిస్తామని వారితో అన్నారు. తాగునీటి సమస్య లేకుండా మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ హన్నన్ జవీద్ మాట్లాడుతూ రెండు నుంచి మూడు రోజుల్లో నూతన మున్సిపల్ కమిషనర్ ను నియమించడంతో పాటు పురపాలక సంఘం అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు.

# కోహిర్ మున్సిపాలిటీలో కమిషనర్ నియామకానికి కౌన్సిలర్ల ధర్నా

- అధికారుల లేమితో పరిపాలన స్తంభనం...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 04:**
తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహిర్ నూతన మున్సిపాలిటీలో కమిషనర్ మరియు సంబంధిత మున్సిపల్ అధికారులు లేకపోవడంతో పరిపాలనా వ్యవహారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోహిర్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు ఎనిమిది మంది కమిషనర్లు మారడం జరిగిందని తెలిపారు. స్థిరమైన పరిపాలన లేకపోవడంతో అభివృద్ధి పనులు స్థంభించి పోయాయని విమర్శించారు. తక్షణమే పూర్తి స్థాయి కమిషనర్‌ను నియమించి మున్సిపల్ పాలనను గాడిలో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీగా ప్రకటించినప్పటికీ అవసరమైన అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ప్రాథమిక సేవలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనన, మరణ ధృవపత్రాల జారీ ఆలస్యం కావడం, ఆస్తి పన్నుల వసూలు, నీటి బిల్లుల నిర్వహణ, భవన నిర్మాణ అనుమతుల జారీ వంటి పౌర సేవలు నిలిచిపోవడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి పనులు కూడా అధికారుల లేమితో నిలిచిపోయాయని ఆరోపించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల అనంతరం దాదాపు అన్ని మున్సిపాలిటీలలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించగా, కోహిర్ మున్సిపాలిటీలో మాత్రం ఇప్పటివరకు సమావేశం నిర్వహించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కోహిర్ మున్సిపాలిటీకి వెంటనే శాశ్వత కమిషనర్‌తో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి పరిపాలనను సక్రమంగా నిర్వహించాలని, లేని పక్షంలో మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# గ్రామం మధ్యలో సెల్ టవర్ నిర్మాణం

- సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన

**పెద్దపల్లి,మార్చి4( వెలుతురు):**
ఆరోగ్యానికి కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇండ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మించొద్దని పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు బుధవారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మేకల రోజారాణి యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం పేరుతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మేకల విజయ్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ప్రాణసంకటంగా మారేందుకు కారణం కాబోతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, గ్రామస్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలనే ఉద్దేశంతో గ్రామసభను ఏర్పాటు చేశారని అన్నారు. ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఏర్పాటుతో రేడియేషన్ మూలంగా అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. గ్రామానికి కొద్ది దూరంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఎయిర్‌టెల్ యజమాన్యాన్ని కోరినా వినకుండా గ్రామంలోని పోచమ్మ దేవాలయం కోసం కేటాయించిన స్థలంలో సెల్ టవర్ ఏర్పాటుకు గ్రామానికే చెందిన ఓదెల రాజు అనే రైతు తన భూమిగా పేర్కొంటూ తనకు అన్ని అనుమతులున్నాయని చెబుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీ వర్సెస్ గల్లీ సమాఖ్య వ్యవస్థలో

# ముదిరిన నిధుల రగడ!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

భారతదేశం అంటే కేవలం భూభాగాల కలయిక కాదు,అదొక విభిన్న సంస్కృతుల, భాషల, మరియు భౌగోళిక పరిస్థితుల సంగమం. ఈ వైవిధ్యాన్ని కాపాడుతూనే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు మన రాజ్యాంగ నిర్మాతలు సమాఖ్య (Federal) వ్యవస్థను ఎంచుకున్నారు. ఈ వ్యవస్థలో కేంద్రం ఒక పెద్దన్న పాత్ర పోషిస్తే, రాష్ట్రాలు కుటుంబ సభ్యుల వలె తమ బాధ్యతలను నెరవేరుస్తుంటాయి. అయితే, ఏ కుటుంబంలోనైనా డబ్బు విషయంలో ఘర్షణలు రావడం సహజం. భారత రాజకీయ యవనికపై ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారిన అంశం ఏదైనా ఉందంటే, అది కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలే. మన రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించింది. రక్షణ, విదేశీ వ్యవహారాలు వంటివి కేంద్రం చూసుకుంటే.. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి క్షేత్రస్థాయి అంశాలు రాష్ట్రాల పరిధిలోకి వస్తాయి. అయితే, రాజ్యాంగంలోని 12వ భాగం (ఆర్టికల్ 264 నుండి 293) ఈ ఇద్దరి మధ్య ఆర్థిక సంబంధాలను శాసిస్తుంది. నిజానికి, పన్నులు వసూలు చేసే ప్రధాన అధికారాలు కేంద్రం వద్దే ఉన్నాయి. ఆదాయపు పన్ను, కస్టమ్స్ సుంకాలు వంటి భారీ ఆదాయ వనరులు కేంద్రానివి కాగా, భూమి శిస్తు వంటి పరిమిత వనరులు రాష్ట్రాల వద్ద ఉన్నాయి. ఈ అసమతుల్యత ను సరిదిద్దడానికే రాజ్యాంగం ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసింది. అదే ఆర్థిక సంఘం (Finance Commission). ఆర్టికల్ 280 ప్రకారం ప్రతి ఐదు ఏళ్లకు ఒకసారి రాష్ట్రపతి ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు. కేంద్రం వసూలు చేసిన పన్నుల్లో రాష్ట్రాలకు ఎంత వాటా ఇవ్వాలి? ఏ ప్రాతిపదికన ఇవ్వాలి? అన్నది ఈ సంఘమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతం మనం 16వ ఆర్థిక సంఘం ముంగిట ఉన్నాం. ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలో ఈ సంఘం తన కసరత్తు చేస్తోంది. గతంలో 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాల వాటాను 32% నుండి ఏకంగా 42%కి పెంచి ఒక విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. అయితే, 15వ ఆర్థిక సంఘం (2021-26) కాలంలో జమ్మూ కాశ్మీర్ విభజన వల్ల ఈ వాటాను 41%కి స్వల్పంగా తగ్గించారు. ఈ నిధుల బదిలీ అనేది కేవలం అంకెలకు సంబంధించింది కాదు, ఇది రాష్ట్రాల ఆత్మగౌరవానికి మరియు అభివృద్ధి కాంక్షకు సంబంధించిన విషయం. కేంద్రం నుండి రాష్ట్రాలకు నిధులు ప్రవహించే తీరును మనం మూడు విభాగాలుగా చూడవచ్చు .ఇది రాష్ట్రాల హక్కు. జనాభా, అటవీ విస్తీర్ణం, ఆదాయ వ్యత్యాసం వంటి అంశాల ఆధారంగా ఈ నిధులు అందుతాయి. ఆర్టికల్ 275 కింద వెనుకబడిన లేదా ప్రత్యేక అవసరాలున్న రాష్ట్రాలకు కేంద్రం అదనపు నిధులు ఇస్తుంది. ఉపాధి హామీ (MGNREGA), జల్ జీవన్ మిషన్ వంటి పథకాల ద్వారా కేంద్రం నిధులు ఇస్తుంది. కానీ ఇక్కడ ఒక మెలిక ఉంది. ఈ పథకాలకు రాష్ట్రాలు కూడా తమ వాటా (సాధారణంగా 40%) వేయాల్సి ఉంటుంది. మేము నిధులు ఇస్తాం, కానీ మేము చెప్పినట్లుగానే ఖర్చు చేయాలి అనే కేంద్రం ధోరణిపై రాష్ట్రాలు తరచూ అసహనం వ్యక్తం చేస్తుంటాయి. 2017లో అమల్లోకి వచ్చిన GST (వస్తు సేవల పన్ను)



భారత ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద సంస్కరణ. దీనివల్ల పన్నుల గందరగోళం తొలగిపోయింది కానీ, రాష్ట్రాలు తమ సొంతంగా పన్నులు విధించుకునే అధికారాన్ని (రాశీజవతీవఅస్త్రత్‌ఎ) కోల్పోయాయి. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆదాయం పడిపోయినప్పుడు, కేంద్రం ఇవ్వాల్సిన +ూ పరిహారం ఆలస్యం కావడం కేంద్ర-రాష్ట్రాల మధ్య నమ్మకాన్ని కొంత సడలించింది. ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాల్లో అత్యంత కీలకమైన అంశం దక్షిణాది రాష్ట్రాల ఆందోళన . తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచాయి. అయితే, ఆర్థిక సంఘం నిధుల పంపిణీకి 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల ఈ రాష్ట్రాలకు నష్టం జరుగుతోంది. ఎక్కువ పన్నులు కడుతున్నాం, జనాభాను తగ్గించి దేశాభివృద్ధికి సహకరిస్తున్నాం.కానీ బహుమతిగా మాకు నిధుల కోత విధిస్తారా? అనేది వీరి వాదన. ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ నిధులు వెళ్లడంపై దక్షిణాదిలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలు కేంద్రం నుండి ఆశించేది చాలా ఉంది.విభజన తర్వాత రెవెన్యూ లోటును పూడ్చుకోవడం ఏపీకి పెద్ద సవాలుగా మారింది. ప్రత్యేక హోదా (Special Category Status) డిమాండ్ ఇప్పటికీ సజీవంగానే ఉంది. పోలవరం ప్రాజెక్టు వంటి భారీ నిర్మాణాలకు కేంద్రం నుండి వచ్చే నిధులు ఆ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. తలసరి ఆదాయంలో ముందున్న తెలంగాణ, తమ సంపదలో పెద్ద వాటా కేంద్రానికి వెళ్తోందని, కానీ అందుకు తగ్గట్టుగా ప్రాజెక్టులకు అనుమతులు లేదా నిధులు రావడం లేదని వాదిస్తోంది. అప్పుల పరిమితి (FRBM) విషయంలో కేంద్రం విధిస్తున్న ఆంక్షలు రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని తెలంగాణ గళం విప్పుతోంది.ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే, మన దేశం రెండు రకాల సమస్యలను ఎదుర్కొంటోంది. కేంద్రం వద్ద ఆదాయం ఎక్కువ, బాధ్యతలు తక్కువ. రాష్ట్రాల వద్ద బాధ్యతలు (ఆరోగ్యం, పోలీస్, వ్యవసాయం) ఎక్కువ, ఆదాయం తక్కువ. మహారాష్ట్ర వంటి ధనిక రాష్ట్రాలకు, బిహార్ వంటి పేద రాష్ట్రాలకు మధ్య ఉన్న అంతరం. ఈ గ్యాప్‌ను పూడ్చడం ఆర్థిక సంఘానికి కత్తి మీద సాము లాంటిదే. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు కేవలం ఘర్షణలకే పరిమితం కాకూడదు. ఇందుకోసం కొన్ని కీలక సంస్కరణలు అవసరం . ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతి ఆయోగ్, రాష్ట్రాల సమస్యలను పరిష్కరించే వేదికగా మరింత క్రియాశీలం కావాలి. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా మార్కెట్ నుండి రుణాలు పొందే విషయంలో మరింత పారదర్శకత, స్వేచ్ఛ ఉండాలి.పన్నుల పంపిణీలో కేవలం జనాభానే కాకుండా, రాష్ట్రాల పనితీరు (Efficiency) మరియు అభివృద్ధి సూచీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి రాష్ట్రాల అభ్యర్థనలకు విలువనిస్తూ, నిర్ణయాల్లో ఏకాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలు అనేవి ఒక రబ్బరు బ్యాండ్ లాంటివి. ఒకవైపు నుంచి ఎక్కువగా లాగితే తెగిపోయే ప్రమాదం ఉంది. కేంద్రం అధికార కేంద్రీకరణ వైపు కాకుండా, సహకారాత్మక సమాఖ్య (Cooperative Federalism) వైపు అడుగులు వేయాలి. రాష్ట్రాలు కూడా ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలి. అంతిమంగా, కేంద్రం నుండి వచ్చే ప్రతి రూపాయి సామాన్యుడి జేబులో నుండి వెళ్ళిన పన్నే. ఆ రూపాయి తిరిగి అదే సామాన్యుడికి రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలల రూపంలో అందాలి. అప్పుడే రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న బలమైన, సుసంపన్నమైన భారతదేశం సాధ్యమవుతుంది. ఢిల్లీ మరియు రాష్ట్ర రాజధానుల మధ్య ఉన్న దూరం తగ్గాలి,అది కేవలం నిధుల పంపిణీతోనే కాదు, పరస్పర గౌరవం మరియు నమ్మకంతోనే సాధ్యం.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 4**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎఫ్ఓ, ఏసీ (ఎల్బీ), సబ్ కలెక్టర్, ఏసీ రెవెన్యూ (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), డీపీఓ, డీఆర్డీఓ, సీఈఓ జెడ్పీ, డీఎంహెచ్ఓ, డబ్ల్యుఓ, డీఈఓ, ఎస్ఈ ఎన్‌పీడీసీఎల్, ఎంసీ కామారెడ్డి, డీఏఓ, డిహెచ్ఎస్ఓ, పీడీ హౌసింగ్, సీపీఓ, ఈఈ పీఆర్, ఆర్డీఓ, డీవైఎస్ఓ, అదనపు డీఆర్డీఓ (సెర్ప్), బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), పీడీ మేప్మా, సూపరింటెండెంట్ జి, ఈడీఎం, హెచ్‌హెచ్‌పి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” కింద ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను శాఖల వారీగా 10 థీమ్‌లతో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుందని తెలిపారు.

దశల వారీ కార్యక్రమాలు:
ఏప్రిల్ 2 గ్రామ స్థాయి గ్రామసభలు
ఏప్రిల్ 16 మండల స్థాయి కార్యక్రమం
మే 2 నియోజకవర్గ స్థాయి కార్యక్రమం
మే 22 జిల్లా స్థాయి కార్యక్రమం
జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం

మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 రోజుల కాలంలో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

థీమ్‌ల వారీగా కార్యక్రమాలు:



మార్చి 615: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక డ్రైవ్. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు.
ఏప్రిల్ 611: ఆరోగ్యం ఆరోగ్య శిబిరాలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు.
ఏప్రిల్ 1318: “అరైవ్‌అలైవ్” కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్‌సీట్‌బెల్ట్ తనిఖీలు.
ఏప్రిల్ 2025: సంక్షేమం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల అమలు సమీక్ష.
ఏప్రిల్ 27మే 2: పిల్లల భద్రత డ్రగ్స్‌కు అడ్డుకట్టపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు.
మే 49: రైతు సంక్షేమం వ్యవసాయం, సాగునీరు, ఎరువులువిత్తనాల సరఫరా, నిరంతర విద్యుత్ అందుబాటు.
మే 1116: విద్య పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, హాజరు, బోధన నాణ్యతపై సమీక్ష.
మే 1823: యువత, క్రీడలు క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు.
మే 2530: మహిళలు స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగం.
జూన్ 112: పర్యావరణం వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు.

పరిశుభ్రత కార్యక్రమాలను మార్చి 6 నుంచి 16 వరకు విస్తృతంగా నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట చెత్త నిర్మూలన, తడిపొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల రుణాల పంపిణీ, వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు.

99 రోజుల ప్రజాపాలన లో భాగం గా లిఉద్యాన మరియు లిపట్టు పరిశ్రమలి శాఖ ప్రణాళిక:

1). ఉద్యాన శాఖ ద్వారాలి ఆయిల్ పామ్ సాగు సబ్సిడీ మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఆయిల్ పామ్ వేసుకున్న రైతుల వ్యవసాయ క్షేత్ర ల లో డిమాంట్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందిలి .
2. పండ్ల తోటలు & కూరగాయల సాగు చేసే రైతులకి వీ×ఐఎ పథకం కింద ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సబ్సిడీ ల మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది.
3. వేసవి కాలం లో కూరగాయల సాగు ని పెంచడానికి రైతులకి కూరగాయల మినీ కిట్స్ నీ అందించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది.
4. మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ల గురించి తెలియచేసి, డ్రిప్ వాడకం దానివల్ల దిగుబడి ఎలా పెరుగుతుంది అని తెలియచేయడం జరుగుతుంది.
5. పట్టు పరిశ్రమ శాఖ ద్వార అందిస్తున్న సబ్సిడీ గురించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాలపై శాఖల వారీగా సమగ్ర రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# మూడు నెలల్లో మూడు దేశాలపై దాడులు..



**న్యూయార్క్, మార్చి4( వెలుతురు):**
అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. 2026లో నెలకొకరనిని టార్గెట్ చేస్తున్నాడు. ఏడాది పాలన పూర్తి కావడంతో తనలోని యుద్ధ కాంక్షను బయటపెట్టిన ట్రంప్ అమెరికా ప్రయోజనాల కోసం యుద్ధం చేస్తున్నాడు. యుద్ధాలు ఆపుతానని గద్దెనెక్కిన నేత.. జరుగుతున్న యుద్ధాలు ఆపకుండా.. కొత్త యుద్ధాలు మొదలు పెట్టాడు. జనవరి నుంచి మార్చి 1 వరకు ముగ్గురిని టార్గెట్ చేశాడు. వెనిజుల్లా అధ్యక్షుడు నికోలస్ మదురోను ట్రంప్ ఈ ఏడాది జనవరిలో టార్గెట్ చేశాడు. వెనెజువెలాలోని ఆయిల్ నిల్వల కోసం ఆ దేశ అధినేతను సైలెంట్‌గా కిడ్నాప్ చేయించాడు. ఇక తమ దేశంలోకి డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నాడని మెక్సికోకు చెందిన లార్డ్ ఎల్ మెంచోను ట్రాప్ చేసి ఫిబ్రవరిలో హతమార్చాడు. ప్రియురాలును ట్రాప్ చేసి మెంచోను హతమార్చారు. ఇక తాజాగా ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీని మట్టుబెట్టాడు. అణ్వాయుధాలు తయారు చేస్తున్నాడన్న సాకుతో ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేశాడు. చివరకు హతమార్చాడు.ఈ టార్గెట్లు రాజకీయ, డ్రగ్స్, మతపరమైన తీవ్రవాదానికి చిహ్నాలు. అమెరికా ఇప్పుడు 'హిట్ లిస్ట్' రక్షణ, వాణిజ్య ఆధారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి పెడుతోంది. ఈ వ్యూహం ద్వారా వాసింగ్టన్ తన ప్రభావాన్ని పునరుద్ధరిస్తూ, ప్రత్యర్థులకు హెచ్చరికలు జారుస్తోంది.ఇక ట్రంప్ తర్వాతి లక్ష్యం ఉత్తర కొరియా అని విశ్లేషకులు భావిస్తున్నారు. కిమ్ అణు కార్యకలాపాలు, మిస్సైల్ పరీక్షల కారణంగా దాడి చేసే అవకాశం ఉంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యాపైనా దాడికి అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. రష్యాపై సైబర్ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక తర్వాతి లక్ష్యం చైనా. చైనా ? తైవాన్ ఉద్రిక్తతలు, దక్షిణ చైన సముద్రం వివాదాలు లక్ష్యంగా మారవచ్చు. మధ్యప్రాచ్యంలో హమాస్, హిజ్బుల్లా సంబంధాలు కొత్త టార్గెట్లకు దారి తీస్తాయి.అమెరికా దుందుడుకు చర్యలతో మిత్రరాజ్యాలకు ఇబ్బందులు లేకపోయినా.. ప్రత్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి విమర్శలు, వాణిజ్య యుద్ధాలు పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా ఈ మార్గంలో స్వయం రక్షణను సాకుగా చూపుతోంది.

# రంగంలోకి నాగబాబు...



**హైదరాబాద్, మార్చి4( వెలుతురు):**
మెగా బ్రదర్ నాగబాబు త్వరలో మంత్రి కానున్నారు. ఇప్పటికే ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులో భాగంగా గత ఏడాది ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. అయితే ఆయన అనుకున్న స్థాయిలో వాయిస్ వినిపించడం లేదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఎదుర్కోలేకపోతున్నారని స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రశ్నించేసరికి నాగబాబు అప్రమత్తమయ్యారు. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం ప్రారంభించారు. వరుసగా వీడియోలు విడుదల చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగానే నిలదీస్తున్నారు. తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. కర్మ చుట్టూ ఆయన కామెంట్స్ కొనసాగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కర్మ విడిచిపెట్టదు అని ఆయన తేల్చి చెప్పారు.ఇటీవల శాసనమండలిలో నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చ జరిగిన సంగతి తెలిసిందే. అయితే అర్థాంతరంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనతో మండలిలో చర్చ ముగిసింది. అందుకే తనకు ఏ అవకాశం రాలేదని.. మాట్లాడలేకపోయానని.. అందుకే ఈ ప్రత్యేక వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు నాగబాబు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుల మీద తప్పులు చేసిందని.. నెయ్యి కల్తీ చేశారని.. టికెట్ల జారీలో కూడా అవినీతి జరిగిందని.. వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని.. కర్మ ఎవరిని విడిచి పెట్టదు అని కొన్ని ఆధ్యాత్మిక మాటలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓ రేంజ్ లో వేసుకున్నారు నాగబాబు. అయితే నాగబాబు వీడియో జనసైనికులకు బాగానే తాకింది. ఇకనుంచి టీటీడీ లడ్డు వ్యవహారంలో జనసేన సైతం విరుచుకు పడే పరిస్థితి కనిపిస్తోంది.మొన్న ఆ మధ్యన పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులను గట్టిగానే హెచ్చరించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అంటే ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే కాదు అని.. అందులో జనసేన సైతం ఉందన్న విషయాన్ని గ్రహించుకోవాలని హెచ్చరించిన సంగతి తెలిసిందే. సినిమా పరిశ్రమపై మాట్లాడేవారు సైతం లడ్డు వివాదంపై ఎందుకు మాట్లాడడం లేదని పవన్ ప్రశ్నించినట్లు ఆ మధ్యన కామెంట్స్ వినిపించాయి. పవన్ కళ్యాణ్ ఓ దశలో మెగా బ్రదర్ నాగబాబు పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పటినుంచి నాగబాబు వీడియోలు విడుదల చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఆగ్రహం బాగానే పనిచేస్తుందన్న కామెంట్స్ ఇప్పుడు వినిపిస్తున్నాయి. మొత్తానికి అయితే మెగా బ్రదర్ నాగబాబు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మార్చురీలో పీక్కుతున్న మృతదేహాలు

**మహబూబ్ నగర్, మార్చి4( వెలుతురు):**
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మార్చురీలో భద్రపరిచిన ఒక వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయన్న వార్తపై ప్రభుత్వం వెంటనే స్పందించింది.ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశార. ఆయన ఆదేశాల అనంతరం.. మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్వయంగా జడ్చర్ల ఆసుపత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మార్చురీ నిర్వహణలో దారుణమైన వైఫల్యం , విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ , ఎంఎస్‌వో ఉన్నారు.మార్చురీ వంటి సున్నితమైన ప్రదేశాలలో కనీస రక్షణ కరువవడం, కుక్కలు లోపలికి వెళ్లి మృతదేహాన్ని పీక్కుతినే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో మృతదేహాలకు కూడా గౌరవం దక్కడం లేదని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్చురీల భద్రతను పటిష్టం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు

- కూటమి వచ్చాకనే పెట్టుబడుల రాక
- ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల కల్పన
- విద్యాశాఖలో ఐటితో పాటు ఎఐ వినయోగం
- మధ్య తరగతి, పేదవారికి యూనివర్సల్ హెల్త్ స్కీమ్
- పేదల వైద్యం కోసం ఒక్కొక్కరికి 20లక్షల వరకు ఖర్చు
- పిపిపి మోడల్‌లో కాలేజీల నిర్మాణం
- ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రులు
- చిన్న పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం
- 20లక్షల ఉద్యోగాల కల్పన హామీ దిశగా ప్రణాళిక
- 30,500కు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం
- ఇప్పటివరకూ 6,28,327 మందికి ఉద్యోగాలు
- టూరిజం అభివృద్ధితో ఉద్యోగాల కల్పనకు కృషి
- రూ.9,03,562 కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- ఇప్పటికే 72 ప్రాజెక్టులకు శంకుస్థాపన
- విశాఖలో ఐటి కంపెనీలు స్థాపన జరుగుతున్నాయి
- అసెంబ్లీలో పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడిన చంద్రబాబు



**అమరావతి,మార్చి4 వెలుతురు:**
కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆయా అంశాలపై బుధవారం నాడు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ.. 'విద్యాశాఖలో ఐటీని వినియోగించుకున్న అనంతరం ఏఐను సైతం వినియోగించుకుంటున్నారు. మధ్య తరగతి, పేదవారికి యూనివర్సల్ హెల్త్ కవరేజి తేవడంతోపాటు ప్రతి ఒక్కరికీ రూ.2.50లక్షల ఇన్సూరెన్స్ ఎన్డీయే ప్రభుత్వం చేసింది. పేద వారికి వైద్యం కోసం ప్రతి ఒక్కరికీ రూ.20లక్షల వరకూ ఖర్చు చేయడానికి సిద్ధం. పీపీపీ కింద కాలేజీల నిర్మాణం చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేస్తాం అని అన్నారు. పీపీపీ అంటే ప్రైవేట్ కాదు.. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ మాత్రమే. మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఉండాలి. అందుకే దానిని మనం ప్రోత్సహిస్తున్నాం గత పాలనలో చాలా పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయాయి. బ్రాండ్ పోతే చాలా కష్టం. ఆర్బీఐ ఇటీవల ఒక పబ్లికేషన్ ఇచ్చారు. అయితే దీని ప్రకారం మన రాష్ట్రంలో చిన్న పరిశ్రమలు తగ్గిపోయాయి. గత ప్రభుత్వం గంజాయిని ప్రోత్సహించింది తప్ప ఒక్క డీఎస్సీ, ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదు. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చాం.. దాన్ని నిలబెట్టుకుంటాం. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని ఉద్యోగాలు కల్పించే కమిటీ చాలా బాగా పనిచేస్తోంది. టూరిజానికి పరిశ్రమల స్థాయి కల్పించాం. నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్క్ పెడుతున్నాం. ఎంఎస్ఎంఈలలో సుమారు 2.40లక్షల వరకూ ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగాలు 30,500కు పైగా ఇచ్చాం. రాష్ట్రంలో ఇప్పటివరకూ 6,28,327మందికి ఉద్యోగాలు ఇచ్చాం అన్నారు. 20నెలల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు ఒకే మాటగా నిలబడ్డాయి. ఒక్క రూపాయికి విశాఖలో భూమి కేటాయించాలన్నప్పుడు నేను ఆలోచించా. అయితే మొదట టీసీఎస్‌కు ఇచ్చాం. ఈ నిర్ణయంతో అనేక మార్పులు వచ్చాయి. గత 20 నెలల్లో అనేక కంపెనీలు విశాఖకు క్యూ కట్టాయి. ఆర్సెలర్ మిట్టల్ 69 వేల కోట్ల ఫేజ్ వన్‌ను ప్రారంభిస్తారు. అందుకు మార్చి 26న భూమి పూజ చేస్తాం. ఏప్రిల్ నెలలో విశాఖలో గూగుల్‌కు భూమి పూజ చేస్తాం. ఇకపై ఎవ్వరూ ప్రభుత్వం వద్దకు వచ్చే అవసరం లేకుండా వారికి ఇవ్వాల్సిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే అందిస్తాం. అతిథి దేవోభవ మన విధానం.... టూరిజం మా ప్రయారిటీ' అని చెప్పారు. విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌తో దూకుడు.. 15 రంగాల్లో 613 ఒప్పందాలు తద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 16.13 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటి వరకు 20 నెలల్లో 15 సార్లు ఎస్ఐపీబీ సమావేశం జరిగిది. అందులో మొత్తం 237 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. రూ.9,03,562 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే 72 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. ఎస్ఐపీబీ ఆమోదంతో 8,54,817 ఉద్యోగాలు వస్తున్నాయి. 77,469 మంది నిరుద్యోగ యువతకు స్కిల్ ట్రైనింగ్‌తోపాటు వర్క్ ఫ్రమ్ హోం ఫెసిలిటీ కల్పిస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాకినాడలో గ్రీన్ హైడ్రోజన్. అలాగే రాష్ట్రానికి ఎల్జీ, ఐబీఎం, కాగ్నిజెంట్, సిఫీ, బీపీసీఎల్, టాటా పవర్, రెన్యూ పవర్, తాజ్, ఐటీసీ, రిలయన్స్, రేమాండ్ వంటి బడా సంస్థలు వస్తున్నాయి. 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక మొత్తం 6,28,347 ఉద్యోగాలు సాకారమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగాలు 30,607 ద్వారా డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం అని చంద్రబాబు వివరించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి 3 ఎకనామిక్ రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి చేస్తున్నాం. 2047 నాటికి విశాఖ రీజియన్‌లో 800 బిలియన్ డాలర్ల జీడీపీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రంగం అభివృద్ధికి మాస్టర్ ఎ÷-లాన్‌కు రూపకల్పన చేశాం. ఐటీ, జీసీసీ, డేటా సెంటర్ హబ్‌గా విశాఖపట్నం. క్వాంటం సిటీగా అమరావతి. రాయలసీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్టికల్చర్ ప్రాధాన్యం. కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్ ? అనకాపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్, నెల్లూరులో రూ.95 వేల కోట్లతో బీపీసీఎల్ రి÷నైరీ.. సీమలో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నాం. అతిథి దేవోభవ అనేది మన విధానం. ఆత్మీయత పంచడంలో మనల్ని మించిన వారు లేరు. టూరిజం కేవలం ఆదాయ వనరు కాదు. తెలుగు నేల సంస్కృతి, సంప్రదాయాలను దశదిశలా చాటే వేదిక. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాం. క్యాపిటల్ సబ్సిడీ, రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులు, పారదర్శక భూ కేటాయింపులు వంటి చేశాం. హోటళ్లు, రిసార్టులు, టెంట్ సిటీలు, థీమ్ పార్కులు మౌలిక సదుపాయాలలో భారీ పెట్టుబడులు వచ్చాయి. దీంతోపాటు పర్యాటక ఉపాధి, కారవాన్, హోమ్‌స్టే, బి అండ్ బి విధానాలు.. అడ్వెంచర్ స్పోర్ట్స్ మార్గదర్శకాలను రూపొందించాం. టెంపుల్ టూరిజానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం అని అన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో టూరిజం రంగంలో 102 ఒనీజల ద్వారా రూ.18,448 కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 3,06,648 ఉద్యోగాలను రాబోతున్నాయి. ఎనిమిది ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం రూ.428 కోట్ల మేర నిధులను గ్రాంట్‌ను అందించింది. రూ.98 కోట్లతో సూర్యలంక బీచ్, రూ.94 కోట్లతో అఖండ గోదావరి, రూ.78 కోట్లతో గండికోట గార్జ్, రూ.54 కోట్లతో సింహాచలం ఖ÷ంఉ÷ూంఆ ప్రాజెక్ట్, రూ.30 కోట్లతో బొర్రా గుహలు, రూ.25 కోట్లతో అహోబిలం, రూ.25 కోట్లతో నాగార్జునసాగర్ బౌద్ధ సర్క్యూట్ చేపట్టాం అని చంద్రబాబు తెలిపారు.

# మండలిని కుదిపేసిన తిరుమల లడ్డూ వ్యవహారం

- మంత్రి అచ్చన్న క్రిస్టియన్ వ్యాఖ్యలపై మండిపడ్డ వైసిపి
- స్పీకర్ పోడియం వద్ద ఆందోళనకు దిగిన వైసిపి సభ్యులు
- అచ్చన్న క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- స్పీకర్ మోషెస్ రాజుకు మంత్రి అచ్చన్న క్షమాపణలు
- గందరగోళం మధ్య వాయిదా..తిరిగి నేటికి సభ వాయిదా



**అమరావతి,మార్చి4 వెలుతురు:**
ఏపీ శాసనమండలిలోగందరగోళ పరిస్థితి నెలకొనడంతో చైర్మన్ మోషేన్ రాజు సభను గురువారానికి వాయిదా వేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై తీవ్ర వాదోపవాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. చైర్మన్ పోడియం ఎక్కి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అంతకముందు.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో రగడ చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్‌ను క్రిస్టియన్ అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు ఆందోళకు దిగారు. దీంతో సభను ఒకసారి వాయిదా వేశారు చైర్మన్. తిరిగి మొదలైన తర్వాత కూడా.. జగన్‌కు క్షమాపణ చెప్పాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'జగన్‌ను నేను క్రిస్టియన్ అని అన్నాను, ఆ మాటకు కట్టుబడి ఉన్నాను' అని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని చెప్పమనండి అంటూ సవాల్ విసిరారు. 'టీవీలో చూసి ఉంటారు కదా జగన్... కాదని చెప్పమనండి' అని మంత్రి అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కుటుంబంతో తిరుమల దర్శనానికి ఎందుకు రాలేదని నిలదీశారు. వైసీపీ సభ్యులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దీంతో వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి జగన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం తీవ్ర వివాదంగా మారి.. పాలక, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతుండగా.. రచ్చకు దారితీసింది.. లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మండలి చైర్మన్ మోషేన్ రాజు ఇద్దరు క్రిష్టియన్స్ అంటూ వ్యాఖ్యానించారు. అయితే, అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు చైర్మన్ మోషేన్‌రాజు.. తాను క్రిస్టియన్ కాదని చెప్పారు.. తాను హిందువునని తెలిపారు మండలి చైర్మన్.. అంతేకాదు.. తనను క్రిస్టియన్ గా మార్చాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడమే కాకుండా.. అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు.. దీంతో, శాసన మండలిలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.. ఈ సందర్భంగా మళ్లీ మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. తాను మండలి చైర్మన్ క్రిస్టియన్ అనుకున్నాను.. ఆయన తాను హిందువును అని చెప్పారు.. అందుకే నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకుంటున్నాను అన్నారు.. మండలి చైర్మన్ కు తప్పు అయ్యిందని ఒప్పుకుంటున్నా అన్నారు అయినా, మండలిలో మంటలు తగ్గలేదు..
మొత్తంగా క్రిస్టియన్స్ వ్యవహారంలో మండలిలో రచ్చగా రేపగా.. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కాసేపు శాసన మండలి వాయిదా పడింది.. ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రసంగించారు. వైసీపీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రూ.320లకు కిలో ఆవు నెయ్యి ఎక్కడైనా దొరుకుతుందా?' అని ప్రశ్నించారు. వీళ్లు హిందువులు ఎలా అవుతారంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. రూ.320లకు ఆవు నెయ్యి కొనాలని అడుగుతున్న వైసీపీ సభ్యులు.. ఎమ్మెల్సీలు ఎలా అయ్యారని నిలదీశారు. సోమువీర్రాజు మాట్లాడుతున్న సమయంలో పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో చైర్మన్ సభను గురువారానికి వాయిదా వేశారు.

# ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే లక్ష్యం

**- పబ్లిక్ సర్వీసు నియామకాల బిల్లు సవరణపై లోకేశ్**

**అమరావతి,మార్చి4 వెలుతురు:**
ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల బిల్లు సవరణకు సంబంధించిన బిల్లును మంత్రి లోకేశ్ బుధవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025 సెప్టెంబర్ 27వ తేదీన అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదించి శాసనమండలికి పంపించామని ప్రస్తావించారు. అక్కడ బిల్లు ప్రవేశపెట్టలేదని... వంద రోజులు దాటడంతో మళ్లీ బిల్లు అసెంబ్లీకి వచ్చిందని చెప్పుకొచ్చారు. 1996లో చంద్రబాబు సీఎం అయ్యాక ఫ్యాక్షన్ రాజకీయాలపై యుద్ధం ప్రకటించారని గుర్తుచేశారు. 2004 తర్వాత దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 164మంది తెలుగుదేశం కార్యకర్తలను దారుణంగా చంపేశారని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలను పరామర్శించి వెళ్లే లోపే మరో హత్య జరిగిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ హత్యలకు గురైన వారి పిల్లలను చదివించేందుకు ఎన్టీఆర్ స్కూల్లో ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆ పిల్లలు ఫ్యాక్షన్‌లోకి వెళ్లకుండా మంచి భవిష్యత్తు ఉండేలా తాము చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని అన్నారు. 2019 నుంచి 2024 మధ్యలో కూడా ఇలాంటి హత్యలు చాలా జరిగాయని ప్రస్తావించారు. బీసీ వర్గానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12వ తేదీన దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన నిలబడ్డారని.. ప్రజల కోసం పోరాడారని కీర్తించారు. నడిరోడ్డుపై చంద్రయ్యను గొంతు కోసి చంపారని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'జై జగన్' అంటే వదిలేస్తామని చెప్పినా చంద్రయ్య భయపడలేదన్నారు. వైసీపీ హయాంలో 'జై చంద్రబాబు, జై తెలుగుదేశం' అన్నందుకు ఆయనను చంపివేశారని ధ్వజమెత్తారు. చంద్రయ్య హత్య ఎలా జరిగిందో దేశం మొత్తం చూసిందని అన్నారు. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వటం కోసం కూటమి పార్టీలు సమ్మతించాయని తెలిపారు. గతంలో శాసనసభలో ఈ బిల్లుకు ఆమోదం లభించినా.. శాసనమండలి దాన్ని పక్కన పెట్టిందని చెప్పుకొచ్చారు. కనీసం బిల్లుని తిరస్కరించినా.. మనం అసెంబ్లీలో ఆమోదించుకునేవాళ్లమని తెలిపారు. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలని, ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి... ఇలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి నారా లోకేశ్ కోరారు.

# శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై దాడి

**- 101 మంది గల్లంతయినట్లు సమాచారం**



**కొలంబో, మార్చి4( వెలుతురు):**
ఇజ్రాయెల్–అమెరికా కూటమి, ఇరాన్ మధ్య యుద్ధంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్‌కు చెందిన నౌకపై జలాంతర్గామి దాడి జరిగింది. ఈ దాడిలో 101 మంది గల్లంతయ్యారు. మరో 78 మంది గాయపడినట్టు శ్రీలంక నేవీ, రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు బుధవారంనాడు తెలిపాయి. వీరిలో 32 మంది పరిస్థితి తీవ్రంగా ఉందని పేర్కొన్నాయి. కాగా, 180 మందితో ఉన్న ఐఆర్ఐఎస్ దేనా నౌక మునిగిపోతున్నట్టు తమకు సమాచారం రావడంతో వెంటనే సహాయక సిబ్బందిని రంగంలోకి దించినట్టు విదేశాంగ మంత్రి విజిత హెరాథ్ తెలిపారు. నౌక వేగంగా మునిగిపోతున్న సమయంలో 32 మందిని సిబ్బంది రక్షించారు. గాలె నగర సమీపంలో దక్షిణ తీరానికి కొద్ది దూరంలో ఈ దాడి జరిగింది. క్షతగాత్రులను గాలేలోని స్థానిక ఆసుపత్రికి తరలించారు. సబ్‌మెరైన్‌తో దాడి జరిపిందెవరనేది వెంటనే వెల్లడి కాలేదు. ఐఆర్ఐఎస్ దేనా నౌక విశాఖపట్నంలో జరిగిన నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది.

# ఐదోరోజూ పరస్పర దాడులు

**- ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు**

**- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం**


**- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి**



**టెహ్రాన్, మార్చి4( వెలుతురు):**
ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ గత శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న టీనేజీ ప్రెగ్నెన్సీలు

**- మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ**



**విజయవాడ, మార్చి4( వెలుతురు):**
రాష్ట్రంలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని తెలిపారు. బుధవారం విజయవాడలో రాయపాటి శైలజ విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖపట్నం మినహా అన్ని జిల్లాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై అన్ని విభాగాలతో కలిసి రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్కొక్క జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఇవి పల్నాడు, కర్నూలు జిల్లాల్లో జరుగుతున్నాయని వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యం మీద పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ల్లిదండ్రులు చదువుకోక పోవడం వల్ల కూడా టీనేజ్ ప్రెగ్నెన్సీ పెరిగే అవకాశం ఉందని మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దీనిపై తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియా వల్ల కూడా టీనేజర్లు ఆకర్షణకు గురవుతున్నారని తెలిపారు. వాటి వల్ల సైతం ఈ టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరుగుతున్నాయని రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు.

# వ్యవసాయ పొలంలో జింక ప్రత్యక్షం

**సిద్ధిపేట, మార్చి4( వెలుతురు):**



సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం సాయంత్రం జింక ప్రత్యక్షమైంది. అడవి నుంచి తప్పిపోయి వచ్చిన ఈ జింక, పెట్రోల్ బంకు వెనుక ఉన్న వరి పొలంలోని బురద మడిలో దిగబడిపోయింది. గమనించిన రైతులు వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫారెస్టు అధికారులు జింకను సురక్షితంగా బయటకు తీసి, సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

# ఒకేరోజు రెండు తీర్మానాలు ఆమోదించడం కుదరదు

**- ఒకే అంశంపై రెండు మోషన్‌లు ఎలా పెడతారు**

**- మండలి ఛైర్మన్ తీరుపై మంత్రుల అసహనం**

**అమరావతి, మార్చి4( వెలుతురు):**
ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చర్చ విషయంలో గందరగోళం నెలకొంది. ఒకే అంశంపై ఒకే రోజు రెండు తీర్మానాలను ఆమోదించడం మంచిది కాదంటూ మండలి చైర్మన్ మోషేను రాజు తీరును మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ తప్పుపట్టారు . వైసీపీ సభ్యులు ప్రొసీజర్‌ను ఉల్లంఘిస్తున్నారని నాదెండ్ల మనోహర్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యులు తప్పుడు సంప్రదాయాన్ని తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో గందరగోళం నెలకొనగా.. మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కల్పించుకున్నారు. వైసీపీ సభ్యులు చేసిన 'పొరపాటు' అనే మాటను ఉపసంహరించుకోవాలని సూచించారు. ఈ అంశంపైనే మండలిలో కాసేపు హాట్ హాట్ డిస్కషన్ నడిచింది. వైసీపీ సభ్యులు సభలో ఒకే అంశంపై రెండు మోషన్‌లు ఎలా పెడతారని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. శాసనమండలి చైర్మన్ లేదని చెబుతున్నారు కదా..? అలాంటప్పుడు రెండు అంశాలను వైసీపీ సభ్యులు అజెండాలో ఎలా పెట్టారంటూ మరో మంత్రి అచ్చెన్నాయుడు నిలదీశారు. మీరు ప్రభుత్వానికి అవకాశం ఇవ్వకపోతే ఎలా అంటూ చైర్మన్‌ను మంత్రి పయ్యావుల నిలదీశారు . శాసనమండలిలో చెడు సంప్రదాయాలకు నాంది పలకొద్దని మంత్రి పయ్యావుల కేశవ్ హితవు పలికారు. ఇంతలో మాట్లాడిన మండలి చైర్మన్.. స్వల్పకాలిక చర్చకు మాత్రమే అనుమతిస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇచ్చుకోవచ్చని చెప్పారు. పయ్యావుల కేశవ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా.. వైసీపీ సభ్యులు రియాక్ట్ అయ్యారు. దీంతో ఆగ్రహానికి గురైన మంత్రి పయ్యావుల.. తాను




మాట్లాడుతు న్నప్పుడు వైసీపీ సభ్యులు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ రోజు ప్రజలకు శ్రీవారి లడ్డూ విషయంలో నిజాలు తెలియజేయాలని స్పష్టం చేశారు. బట్టకాల్చి ముఖం మీద వేసిన తర్వాత వాకౌట్ చేసి వైసీపీ సభ్యులు వెళ్లిపోతామంటే కుదరదని ధ్వజమెత్తారు. వైసీపీ సభ్యులు మాట్లాడి వెళ్లిపోతామంటే కుదరదని మంత్రి పయ్యావుల కేశవ్ తేల్చిచెప్పారు. రాజకీయాలకు మండలిని వేదిక చేయొద్దని చెప్పారు. జగన్‌కు దేవదేవుడిపై ఎలాగూ నమ్మకం లేదని.. తిరుమలలో డిక్లరేషన్ కూడా ఇవ్వలేదని పయ్యావుల కేశవ్ చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులు కూడా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దని అన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. సీబీఐ అధికారులు చార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ లేదని చెప్పారని పేర్కొన్నారు. దీనిపై పయ్యావుల కేశవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తప్పు చేసినవారికి తప్పనిసరిగా శిక్ష పడుతుందన్నారు. వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఎన్డీడీబీ రిపోర్ట్ 35వ పేజీలో ఉందని చెప్పారు. అది ఫిర్యాదు మాత్రమేనని వైసీపీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

చంద్రశేఖర్ రెడ్డి వాదనను మంత్రి అచ్చెన్నాయుడు కొట్టిపారేశారు. లడ్డూ నెయ్యిలో కల్తీ గురించి మాట్లాడకుండా ఎలాంటి సంబంధం లేని అంశాలను సభలో మాట్లాడటం మంచిది కాదని మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ చెప్పారు. వైసీపీ సభ్యులు ఎంతసేపయిన మాట్లాడాలి... కానీ వాస్తవాలు మాట్లాడాలని స్పష్టం చేశారు. కల్తీ జరిగిందని అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి చెప్పినా ఎందుకు ఈ విషయాన్ని తొక్కి పెట్టారని మంత్రులు నిలదీశారు. నెయ్యి కొనాలంటే పాలు అక్కరలేదని.. వైసీపీ హయాంలో టీటీడీ టెండర్ నిబంధనలు మార్చారని పయ్యావుల కేశవ్ ఆగ్రహించారు. వైష్ణవి డెయిరీ, సంఘం డెయిరీ ఒకటేనని వైసీపీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి చెప్పిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఖండించారు. ఇందాపూర్, హెరిటేజ్ డెయిరీ ఒకటేనని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రాత్రికి రాత్రి రెండు డైరీలు ఎలా కలుస్తాయని నిలదీశారు. గతంలో, ఇప్పుడు కూడా తిరుమల లడ్డూపై చర్చకు సిద్ధమని తాము చెబుతున్నామని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోతామంటే కుదరదని ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యులను వాకౌట్ చేయకుండా చూడాల్సిన బాధ్యత శాసనమండలి చైర్మన్‌పై ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తిరుమల నెయ్యి కల్తీ అంశంపై చర్చ సందర్భంగా వివాదం రాజుకుంది. మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్సీ తుమాటి మాధవరావుల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరి పై మరొకరు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల సభ్యులు వారిని అడ్డుకున్నారు.

# తిరుమల లడ్డూ కల్తీపై ప్రభుత్వం వివరణ

**- మండలిలో వివరాలతో కూడిన నోట్ పంపిణీ**

**అమరావతి, మార్చి4( వెలుతురు):**
తిరుమల ప్రసాదం కల్తీపై శాసనమండలిలో ప్రకటనను సభ్యులకు పంపిణీ చేసింది సర్కార్. సభ్యులందరికీ 20 పేజీల సమగ్ర ప్రకటనను పంపిణీ చేసి.. కల్తీపై వివరాలను స్పష్టంగా వెల్లడించింది. ఈ ప్రకటనలో తిరుమల లడ్డూ చారిత్రక నేపథ్యం, ప్రామాణిక పదార్థాలు, పోటు–మిరాసీ వ్యవస్థ వంటి అంశాలను వివరించింది. 2014–19 మధ్య కాలంలో అమలైన టెండర్ నిబంధనలు, 2020లో ఆ నిబంధనల్లో చేసిన సడలింపులు, మారిన టెండర్ నివేదికల్లో వచ్చిన మార్పులు అన్నింటినీ స్పష్టంగా వివరించింది. నాటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో అనీల్ కుమార్ సింఘాల్ సిఫార్సుల మేరకు అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు నిబంధనల సడలింపును ఆమోదించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. నెయ్యి కల్తీని గుర్తింపు, ల్యాబ్ నివేదికల వివరాలను ప్రకటనలో వివరించింది. ఈ ఆధారాల మేరకు తిరుమల ప్రసాదం కల్తీ జరిగిందని కేసు నమోదు చేసి, సమగ్ర విచారణకు ఆదేశాలు ఇచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి వివరాలను ప్రకటనలో సవివరంగా పేర్కొంది. 2020లో టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న



నెయ్యి సరఫరాదారు లను బెదిరించి, అంగీకరించని వారిని తనిఖీల పేరుతో లొంగదీసి రూ.4.69 కోట్లు లంచంగా తీసుకున్నట్లు విచారణలో రుజువైందని ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం 36 మంది నిందితుల్లో బోలెబాబా ఉద్యోగులు ఆశిష్ రోహిలా, మహేష్ కుమార్ రోహిలా, బత్తుల సురేంద్ర నాథ్ నేరాన్ని అంగీకరించారని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే డెయిరీ నిపుణుడు విజయభాస్కర్ రెడ్డి తప్పుడు సలహాలు ఇచ్చి రూ.75 లక్షల ఆర్థిక లాభం పొందినట్లు ప్రకటనలో వెల్లడించింది. ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ సిఫార్సులు, వ్యవస్థాగత సంస్కరణలపై ఇవ్వనున్న నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.


# తిరుమలలో మాజీ చైర్మన్ల ఆర్గనైజ్‌డు క్రైమ్

**- మడలి చర్చలో విమర్శలు గుప్పించిన అనూరాధ**

**అమరావతి, మార్చి4( వెలుతురు):**
తిరుమల శ్రీవారిపై గతంలో జగన్ ప్రభుత్వం కక్షగట్టిందని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. టెండర్ నిబంధనలను సవరించి ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. అనేక భయంకరమైన రసాయనాలు కలిసి ఉన్నవాటికి ఆవు నెయ్యి అని పేరు పెట్టారు. రోజుకు 4లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించేశారు. టర్నోవర్ ఏడాదికి రూ.250 కోట్లు అని ఉన్న నిబంధనను రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలిన లేకుండా టెండర్లు కట్టబెట్టారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చేశారు. టెండర్ నిబంధనల సడలింపుపై తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేశారు. నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది. ఇది కుంభకోణమే కాదు.. హిందుత్వం పై దాడి. మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు అని పంచుమర్తి అనురాధ అన్నారు.

# ఫ్యామిలీ మ్యాన్ నుంచి పొలిటిషియన్...

**చెన్నై, మార్చి4( వెలుతురు):**
తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ ప్రస్తుతం తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా దూసుకుపోతుంటే, మరోవైపు 26 ఏళ్ల వైవాహిక బంధం ముగింపు దశకు చేరుకోవడం ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టపై తీవ్ర చర్చకు దారితీసింది.ఫిబ్రవరి 27న విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయడం కోలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. 1999లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సంగీత తన పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. విజయ్ ఒక ప్రముఖ నటితో (త్రిష అని పుకార్లు వినిపిస్తున్నప్పటికీ పిటిషన్‌లో పేరు స్పష్టంగా లేదు) 2021 నుండి సంబంధం కలిగి ఉన్నారని సంగీత ఆరోపించారు. విజయ్ తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని, ఆమె స్వేచ్ఛపై ఆర్థిక ఆంక్షలు విధించారని ఆమె ఆరోపించారు. సదరు నటి విజయ్‌తో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా ఆయన ఖండించలేదని, ఇది తనను, పిల్లలను తీవ్ర అవమానానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు.విజయ్ తన పార్టీ టీవీకేను స్థాపించి, సినిమాలకు స్వస్తి పలికి పూర్తిస్థాయి రాజకీయ నేతగా అవతరించాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విడాకుల వ్యవహారం బయటకు రావడం ఆయనకు రాజకీయంగా పెద్ద దెబ్బ. విజయ్ ఇప్పటివరకు ఒక 'ఫ్యామిలీ మ్యాన్'గా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా తన ఇమేజ్‌ను కాపాడుకుంటూ వచ్చారు. విడాకుల పిటిషన్‌లో నైతికతకు సంబంధించిన ఆరోపణలు రావడంతో ప్రత్యర్థి పార్టీలకు ఇది ఒక ఆయుధంగా మారే అవకాశం ఉంది. రాజకీయాల్లో మహిళా ఓటర్ల మద్దతు చాలా ముఖ్యం. భార్యను నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు మహిళా ఓటర్లలో ఆయనపై ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చు.రాజకీయాలతో పాటు సినిమా పరంగా కూడా విజయ్ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఆయన చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయకన్' సెన్సార్ పరంగా



ఆటంకాలను ఎదుర్కొంటోంది. రాజకీయ సందేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పొంగల్ కు విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పటివరకూ రిలీజ్ కాలేదు. అటు వ్యక్తిగత జీవితం, ఇటు కెరీర్ రెండూ డైలమాలో పడ్డాయి.తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితంపై విమర్శలు రావడం కొత్తేమీ కాదు. గతంలో ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి వంటి నేతలు కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే విజయ్ ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ముఖ్యం. విజయ్ అభిమానులు, యువత దీన్ని ఆయన వ్యక్తిగత విషయంగా చూస్తున్నారు. రాజకీయాల్లో ఆయన సిద్ధాంతాలకు, ఈ వివాదానికి సంబంధం లేదని వారు వాదిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏప్రిల్ 20న కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఈలోగా ఆయన ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారు లేదా ప్రజలకు ఎలా సంజాయిషీ ఇస్తారనే దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.విజయ్ తన జీవితంలో అత్యంత కఠినమైన 'అగ్నిపరీక్ష'ను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు దశాబ్దాల వైవాహిక జీవితం విచ్ఛిన్నం కావడం, మరోవైపు రాజకీయాల్లో స్థిరపడాలనే లక్ష్యం.. ఈ రెండింటి మధ్య ఆయన ప్రయాణం ఆసక్తికరంగా మారింది. ఈ సంక్షోభం నుండి ఆయన ఎలా గట్టెక్కుతారో కాలమే నిర్ణయించాలి. రాజకీయాల్లో నెగ్గాలంటే కేవలం సినిమా పాపులారిటీ సరిపోదని, వ్యక్తిగత ప్రవర్తన కూడా క్లీన్‌గా ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భార్య కాపురానికి రాకపోవడంతో ఆవేదన

**- పురుగుల మందు తాగా తాగి ఆత్మహత్య**




**పెద్దపల్లి, మార్చి4( వెలుతురు):**
కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిలో గల గుండారం గ్రామ శివారులోని పత్తి చేసులో ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ, సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి సంస్థ ఆర్జీ– 3 పరిధిలోని సెంటినరిరాలనీ నర్సరీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి దేవేందర్ పేరపల్లిలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గుండారం శివారులోని ఓ పత్తి చేసులో దేవేందర్ మృతదేహం కనిపించింది. దేవేందర్ గత 15 ఏళ్ల క్రితం పేరపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఆశీష్, కుమార్తె కీర్తన ఉన్నారు. భార్య, భర్త మధ్య రెండేళ్లుగా విభేదాలు జరుగుతున్నాయి . ఏడాదిగా ఇద్దరి పిల్లలతో కలిసి తన తల్లిగారింటికి మల్లేశ్వరి వెళ్లిపోయింది. అప్పటి నుండి దేవేందర్ మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసై మంగళవారం ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కమల్, రజనీల మూవీపై సర్వత్రా ఆసక్తి

## వచ్చే యేడు షూటింగ్ మొదలవుతుందని టాక్

46 ఏళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత లెజెండరీ యాక్టర్లు కమల్ హాసన్, రజనీకాంత్ కాంబోలో సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'జైలర్'ఫేం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ప్రతీ రోజు ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ పెంచేస్తోంది. తాజా న్యూస్ ఒకటి మూవీ లవర్స్‌తోపాటు అభిమానుల్లో క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా..? అని ఎదురు చూస్తున్నఅభిమానుల కోసం అదిరిపోయే వార్త షేర్ చేశాడు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్. ఈ టాలెంటెడ్ కంపోజర్ ప్రకారం ఈ మూవీ షూట్ వచ్చే ఏడాది మొదలు కానుందని చెప్పాడు. ప్రస్తుతం రజినీకాంత్, కమల్ హాసన్ తమ కమిట్‌మెంట్స్ పూర్తి చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్ట్ షూటింగ్‌లో చేరనున్నారని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాని 80స్, 90స్‌లో ఉపయోగించిన ఫిల్మ్ కెమెరాలతో షూట్ చేయనున్నారంటూ ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. నెల్సన్, రాజీవ్ మీనన్ ఇప్పటికే ప్రోమోను ఇదే పద్ధతిలో షూట్ చేయాలనుకున్నా.. టైం తక్కువగా ఉండటం వల్ల డిజిటల్ మెథడ్‌లో ప్రోమోను తెరకెక్కించారని ఇన్‌సైడ్ టాక్. మల్టీస్టారర్ స్పెషల్ గ్లింప్స్ కూడా విడుదల చేయగా.. గ్లింప్స్‌లో కమల్-రజనీ ఇద్దరూ ఎవరు స్టైల్‌లో వారు కనిపిస్తూ.. కాస్ట్యూమ్స్, బూట్లు, బెల్ట్, వాచ్, కళ్లద్దాలతో ఒకరినొకరు డామినేట్ చేసుకునేలా కనిపిస్తూ సందడి చేస్తున్నారు.




# మణిపురి బూంగ్‌కు బ్రిటిష్ అకాడమీ అవార్డు

మణిపురి భాషలో తెరకెక్కిన 'బూంగ్' చిత్రం ప్రతిష్టాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ 2026 అవార్డుల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్' కేటగిరీలో విజేతగా నిలవడమే కాకుండా బాటా గెలుచుకున్న తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయం తర్వాత మేకర్స్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రపంచ వేదికపై భారతీయ ప్రాంతీయ సినిమా సత్తాను చాటిన ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించగా, లక్ష్మీప్రియ దేవి దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే, మణిపూర్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 'బూంగ్' అనే చిన్నారి చుట్టూ కథ తిరుగుతుంది. తన తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలని తపించే ఆ బాలుడు, ఆమెకు ఇచ్చే అత్యంత విలువైన బహుమతి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకురావడమేనని బలంగా నమ్ముతాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి తండ్రి కోసం అతడు చేసే అన్వేషణ, ఆ ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి చిన్నపిల్లల అమాయకత్వాన్ని, వారిలోని స్వచ్ఛమైన ప్రేమను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు.




# పెద్ది రైరై రారా పాటకు భారీగా లైక్స్

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలయికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రా రా' లిరికల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాటకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించడం విశేషం. అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం మాస్, మోటివేషనల్ టచ్‌తో ఆకట్టుకుంటోంది. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది.ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు, ఫాస్ట్ మూమెంట్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన డ్యాన్స్‌ను 'చిరుత' రోజుల్ని గుర్తు చేసేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రశంసలు కురిపించారు. 'రై రై రా రా' సాంగ్ ఎనర్జీ, ఎమోషన్, సినీమాటిక్ బ్రిలియన్స్‌తో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్ డ్యాన్స్ తనను ఎంతో గర్వపడేలా చేసిందని, స్క్రీన్‌పై ఆయన గ్రేస్ ప్రత్యేకంగా మెరిసిందని వ్యాఖ్యానించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఏఆర్ రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందరి కృషి వల్లే ఈ సాంగ్ మరోస్థాయికి వెళ్లిందని అభినందించారు. ఈ ప్రశంసలకు బుచ్చిబాబు సానా భావోద్వేగంగా స్పందిస్తూ, మెగాస్టార్ నుంచి వచ్చిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. రికార్డుల విషయానికి వస్తే, విడుదలైన 24 గంటల్లోనే 'రై రై రా రా' లిరికల్ వీడియో 46.1 మిలియన్ వ్యూస్ సాధించి టాలీవుడ్‌లో అత్యధిక వ్యూస్ అందుకున్న లిరికల్ సాంగ్‌గా నిలిచింది. మాస్ బీట్, ఎనర్జిటిక్ ట్యూన్, రామ్ చరణ్ డ్యాన్స్ అన్నీ కలిసి ఈ రికార్డు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి.అయితే టాప్ లిరికల్ వ్యూస్ జాబితాలో రెండో స్థానంలో కూడా 'పెద్ది' చిత్రానికే చెందిన 'చికిరి చికిరి' పాట 29.19 మిలియన్ వ్యూస్‌తో నిలవడం విశేషం.

# DSP స్థానంలో థమన్?..

## 'ఉస్తాద్ భగత్ సింగ్'లో కీలక మార్పు!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం గురించి ఒక ఆసక్తికరమైన వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవి శ్రీ ప్రసాద్ (ఇుశ్రా) బాధ్యతలు నిర్వహిస్తుండగా, తాజా సమాచారం ప్రకారం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (దీ+వీ) కోసం మ్యూజిక్ సెన్సేషన్ థమన్‌ను రంగంలోకి దించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో కేవలం పాటలకు మాత్రమే దేవి శ్రీ ప్రసాద్ సంగీతం పరిమితం కానుందని, సినిమాలోని మాస్ ఎలివేషన్లు మరియు కీలక సన్నివేశాలకు అవసరమైన రీ-రికార్డింగ్ బాధ్యతలను థమన్‌కు అప్పగించాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్ సాబ్', 'భీమ్లా నాయక్'



వంటి చిత్రాలకు థమన్ తన నేపథ్య సంగీతంతో థియేటర్లను హోరెత్తించిన నేపథ్యంలో, 'ఉస్తాద్' కోసం కూడా హరీష్ శంకర్ అదే మ్యాజిక్‌ను ఆశిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇటీవల జరిగిన ‑ాబత్ఖు శీట ఖర్ఝుఃు సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దేవి శ్రీ ప్రసాద్ స్వయంగా పాల్గొని తన ఉత్సాహాన్ని చాటుకున్న తరుణంలో ఈ మార్పు వార్తలు రావడం గమనార్హం. మరోవైపు గతంలో 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ ఇచ్చిన ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మార్చి 26, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో మ్యూజిక్ విషయంలో జరుగుతున్న ఈ మార్పులపై చిత్ర యూనిట్ నుండి ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# సాంప్రదాయిని సుప్పిని సుద్దిపూసని ఓ మంచి చిత్రం


## నటుడు శివాజీ వెల్లడి

శివాజీ, లయ మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా రూపొందిన ఈ సినిమా థియేటర్లలో ఈనెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో శివాజీ మాట్లాడుతూ మన దేశంలో వినోదం అనగానే సినిమానే గుర్తుకొస్తుందన్నారు. ఈటీవీ విన్ నుంచి సినిమా వస్తుందంటే ఆడియన్స్‌లో ఆసక్తి రెట్టింపు అవుతుంది. వారికి మరింత వినోదం ఇవ్వడం కోసం ఈటీవీ విన్ ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.499కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్, ఎంపిక చేసిన మల్టీప్లెక్స్‌ల్లో రూ.799కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్ అందించాలని నిర్ణయించుకుంది. సినిమా అందరికీ చేరువకావాలనే ఈ ఆఫర్‌ను 'ఈటీవీ విన్' బిజినెస్ హెడ్ సాయికృష్ణ ప్రకటించారు. సినిమా థియేటర్‌లలో పాప్‌కార్న్ అనేది చాలా పెద్ద ఇష్యూ.. దాన్ని ఈటీవీ విన్ సెట్ చేసేసింది. ఈ సినిమా కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది. కుటుంబసమేతంగా చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. నేను ఈ సినిమాకు ఖర్చు పెట్టాల్సింది అంతా కూడా స్క్రీన్ మీదే పెట్టాను. ఒక్కోసారి టీచర్‌లా ప్రవర్తించాను. అలా ఉండడానికి కారణం.. ఒక గొప్ప సంస్థ నన్ను నమ్మి నాకు ఓ బాధ్యత ఇచ్చినప్పుడు వాళ్లకు మంచి అవుట్‌పుట్ ఇవ్వాలి. అందుకే ఈ సినిమాకు మరింత కష్టపడి వర్క్ చేశాను. వాళ్లకు మాట ఇచ్చినట్లు మంచి చిత్రం తీశాను. ఈ ఆఫర్‌ను మాత్రం అందరూ గుర్తుపెట్టుకోండి అని అన్నారు.




# యశ్ టాక్సిస్ జూన్‌కి వాయిదా

యశ్ హీరోగా రానున్న తాజా సినిమా 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక్'ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.



# పంచగ్రామాల సమస్యలను పరిష్కరించండి

- గతంలో జీవోలు ఇచ్చినా అమలు కాలేదు
- అసెంబ్లలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గంటా
- త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామన్న ఆనం

**అమరావతి, మార్చి4( వెలుతురు):**

సింహాచలం దేవస్థానం పరిసరాల్లోని పంచగ్రామాల సమస్యపై విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉందని అన్నారు. పంచగ్రామాలు ఐదు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. 1996లో అప్పల సూర్యనారాయణ ఆధ్వర్యంలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారని... ఆ తర్వాత 2000లో 578 జీఓ, 2019లో 229 జీఓలు జారీ చేశారన్నారు. పంచగ్రామాల్లో రైతుల సమస్యలతో పాటు ఇళ్లు నిర్మించుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సభలో తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 100 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 100 గజాల లోపు స్థలం ఉచితంగా ఇచ్చేలా, అంతకంటే ఎక్కువ ఉంటే డబ్బు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే చరిత్ర క్షమించదన్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ మంత్రులు కూర్చొని తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రశ్నకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమాధానమిస్తూ... గతంలో అసెంబ్లీ హౌస్ కమిటీ, మంత్రివర్గ ఉపసంఘాలు నివేదికలు ఇచ్చాయని తెలిపారు. వాటి ఆధారంగా జీఓలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే ఆలోచనలో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర విధానం రూపొందించిం దని




వివరించారు. కొందరి భూములు క్రమబద్ధీకరించిన తర్వాత మళ్లీ కోర్టుకు వెళ్లడంతో సమస్య తలెత్తిందని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ, రెవెన్యూ శాఖలను సమావేశపరిచి పరిష్కారం చూడాలని సీఎం సూచించారని తెలిపారు. సర్వే పూర్తి చేసిన తర్వాత 12,410 నివాసాలు ఉన్నట్లు తేలిందని, వాటన్నింటినీ క్రమబద్ధీకరించడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి వివరించారు. అంతే విలువైన భూమిని సింహాచలం ఆలయానికి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించగా.. సింహాచలం ట్రస్టు సమ్మతించిందని మంత్రి తెలిపారు. భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయాలను హైకోర్టుకు అఫిడవిట్ రూపంలో అందజేశామని చెప్పారు. హైకోర్టు ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు-2026

- ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు
- రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం




**అమరావతి,మార్చి4( వెలుతురు):**

ఏపీ శాసనసభ ఆమోదించిన రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు-2026 , ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు 2026కు శాసనమండలిలో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. గత గురువారం శాసనసభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజు ద్వారా కేటాయించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు రేటు నిర్ణయించారని.. ప్రతి రెండేళ్లకు 5 శాతం వరకు లీజు మొత్తం పెంచే విధంగా సవరణ చేసినట్లు తెలిపారు. అసైనీ దారులకు ఈ లీజు ద్వారా నికరమైన ఆదాయం లభిస్తుందన్నారు. బంజరు భూములు, చౌడు భూములుగా ఉన్న అసైన్డ్ భూములకు స్థిరమైన ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు క్లీన్ ఎనర్జీ చాలా కీలకమని మంత్రి చెప్పారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమవుతాయని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అసైనీదారుల పూర్తి అనుమతితోనే లీజుకు తీసుకుంటామని వెల్లడించారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ ద్వారా వారికి పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తామని అన్నారు. ఈ చట్ట సవరణతో రూ.10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు-2026కు కూడా శాసనమండలి ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాలను 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు'లుగా మార్చే సవరణకు ఆమోదం లభించింది.

# పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

- మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి,మార్చి4( వెలుతురు):**

పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు దశల్లో నిర్మాణం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైసీపీ అరాచక పాలన కారణంగా సీట్ల సంఖ్య 11కి పడిపోయిందని, అయినా బెదిరింపులు ఆపడం లేదని విమర్శించారు. జగన్ ప్రైవేట్ కళాశాలల మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఇచ్చారన్నారు. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో కళాశాలలు పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. నాలుగు రోజుల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రైవేట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడంపై తణుకు ఎమ్మెల్యే ఏ.రాధాకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. వైసీపీ హయాంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలికారని, చాలా కళాశాలల్లో పునాదులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో సీట్లు అమ్మే పద్ధతిని తెచ్చిందని.. 10 కళాశాలలను ఆరంభించి మధ్యలో వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలల నిధులను దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను పీపీపీ విధానంలో త్వరగా పూర్తి చేయాలని సంకల్పించడం శు భపరిణామమని పేర్కొన్నారు. 'పీపీపీలో కళాశాలల నిర్మాణం



ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు పూర్తవుతుందో చెప్పండి. వైసీపీ పెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఏం చేస్తారు' అని ప్రశ్నించారు. పీపీపీలో కళాశాలలు తీసుకునే వారిని జగన్‌మోహన్ రెడ్డి బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. 17 కళాశాలల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్ర ప్రభుత్వం, 3 సాస్కి కింద మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు అని అన్నారు. జగన్ హయాంలో కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని.. అందులో పులివెందుల కళాశాలకే దాదాపు రూ. 500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 900 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టిందని మంత్రి వివరించారు. కళాశాలలు నిర్మించామని వైసీపీ అసత్యాలు చెబుతోందని మంత్రి విమర్శించారు. పార్వతిపురంలో భూసేకరణ కూడా చేపట్టలేదని అన్నారు.

# జైలు నుంచి విడుదలయిన బాల్క తదితరులు

- క్యాతన్‌పల్లిలో మంత్రి వివేక్ గూండాగిరీ
- మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు



**ఆదిలాబాద్,మార్చి4( వెలుతురు):**


బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# ఆగివున్న లారీని వేగంగా ఢీకొన్న కారు

- నుజ్జునుజ్జు అయిన కారు...ఐదుగురు దుర్మరణం
- బృతులంతా బెంగళూరు వాసులుగా గుర్తింపు

**చిత్తూరు,మార్చి4( వెలుతురు):**

చిత్తూరు జిల్లాలోని పలమనేరు శివారులో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలమనేరు జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఓ కారు వెనుక వైపు నుంచి అత్యంత వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతులు బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చిత్తూరు జిల్లా పోలీసులు తెలిపారు.మృతులను మోహన్ దాస్ (71),నాగరాజారావు (61),కుసుమ (61),జయంతి (59),పూజ (33)గా గుర్తించారు.పోలీసులు



మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. పలమనేరు ప్రమాదంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రమాదానికి కారణం కారుడ్రైవర్ నిర్లక్ష్యమా..? ఇతర సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో జిల్లా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారులపై వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనతో పలమనేరు ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.




# తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

**కామారెడ్డి,మార్చి4( వెలుతురు):**

తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీలోని సౌత్ క్యాంపస్ వసతీగృహంలో మంగళరవా అర్ధరాత్రి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ కొట్లాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వర్సిటీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వారికి చికిత్స అందించారు. వసతీగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే ఫీజు చెల్లింపు

**హైదరాబాద్,మార్చి4( వెలుతురు):**

ఉప్పల్ నియోజకవర్గపరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను బుధవారం నాడు లక్ష్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డిని కేటీఆర్ అభినందించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

- బహుళ అంతస్థుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి
- సవరణ బిల్లు ఆవశ్యకతను వివరించిన హోంమంత్రి అనిత

**అమరావతి,మార్చి4( వెలుతురు):**

ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు



సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com